


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 13-04-2025 | సంపుటి - 22 | సంచిక - 349 | రూ : 4 | పేజీలు: 8


## మదురై తరహాలో భద్రకాళి ఆలయం

- రూ.54 కోట్లతో అభివృద్ధి పనులు
- త్వరలో ప్రభుత్వానికి రాజగోపురాల డీపీఆర్

**వరంగల్ :** వరంగల్‌లోని భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు వడివడిగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో తమిళనాడులోని మదురైలోని మీనాక్షి అమ్మవారి దేవాలయం నమూనాలో అభివృద్ధి చేసేలా రూ.54 కోట్లతో ఇటీవల పనులు ప్రారంభించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పర్యవేక్షిస్తున్నారు. ఆలయం చుట్టూ మాడవీధుల అభివృద్ధికి రూ.30 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రత్యేక రోజుల్లో భద్రకాళి అమ్మవారి ఊరేగింపులు, వాహన సేవలకు ఉపయోగపడేలా 30 అడుగుల వెడల్పుతో

తరువాయి 2లో





## రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతికీ గడువు!

- 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి
- లేదంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు
- తమిళనాడు వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- గవర్నర్ల నిష్క్రియపైనా న్యాయ సమీక్ష...
- ఆ అధికారం తమకుందన్న ధర్మాసనం

2లో

## సర్కారుకే సన్నాలు..!

### బోనస్ లబ్ధితో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయం

- అంచనాలకు మించి వస్తున్న సన్న ధాన్యం
- ప్రైవేటు వ్యాపారులకు అమ్మేందుకు ఆసక్తి చూపని రైతులు

**నిజామాబాద్, కరీంనగర్, కామారెడ్డి;** ఈటీవీ ఖమ్మం: సన్న ధాన్యానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా.. ప్రైవేటు వ్యాపారులు నేరుగా రైతుల నుంచి కల్లాల్లోనే కొనుగోలు చేసేవారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాలంటే.. అక్కడి వరకూ రవాణా చేయడం, నిర్ణీత తేమ శాతం వచ్చేవరకూ ఆరబెట్టడం రైతులకు ప్రయాసతో కూడుకున్న పని. దీంతో సన్న ధాన్యం పండించిన

తరువాయి 2లో



## వైభవంగా .. హనుమాన్ జయంతి

**దిల్లీ:** దేశవ్యాప్తంగా హనుమాన్ జయంతి ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శనివారం విస్తృతంగా శోభాయాత్రలు, హారతులు, భక్తి గాన కార్యక్రమాలు జరిగాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనందం, ఆరోగ్యం సంపదలతో ప్రజలందరూ వర్ధిల్లాలని ఆయన తన సోషల్ మీడియా

తరువాయి 2లో





## రద్దీ రోడ్డుపై ఆవుకు రొట్టె విసిరిన వ్యక్తి..

- కారు దిగొచ్చిన దిల్లీ ముఖ్యమంత్రి

2లో

## రాజధానికి రుణాలిచ్చేందుకు బ్యాంకుల ఆసక్తి

- ఇప్పటికే రూ.26 వేల కోట్ల మంజూరు
- కేఎఫ్‌డబ్ల్యూ నుంచి త్వరలో రూ.5 వేల కోట్లు
- అప్పు ఇచ్చేందుకు దేశీయ బ్యాంకులూ సుముఖత
- బాండ్ల ద్వారానూ సమకూర్చుకునేలా ప్రభుత్వ ప్రణాళిక

2లో



## దిల్లీలో... గాలిదుమారం

- విమానాలకు తీవ్ర అంతరాయం

**దిల్లీ:** గాలి దుమారం, రద్దీ కారణంగా దిల్లీలో శనివారం విమానాలకు తీవ్ర అంతరాయం కలిగింది. 450కి పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. కొన్ని రద్దయ్యాయి. వందల మంది ప్రయాణికులు విమానాశ్రయంలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. నిర్వహణ పనుల కోసం దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో (ఐజీఐఏ) ఒక రన్‌వే మూసివేయగా.. మూడు పని చేస్తున్నాయి.

తరువాయి 2లో





## తొలుత మూడు మండలాల్లో భూభారతి

- ప్రయోగాత్మకంగా అమలు.. అనంతరం రాష్ట్రమంతా విస్తరణ
- ప్రజల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- పోర్టల్‌పై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- 'ఇందిరమ్మ ఇళ్ల' దందాలు చేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశం

2లో

## మరలిపోయిన వనరుషి

- పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య గుండెపోటుతో కన్నుమూత
- మొక్కలు నాటే యజ్ఞంలో ముగిసిన ఓ గొప్ప శకం
- ధరిత్రి ముద్దుబిడ్డను కోల్పోయామని ప్రముఖుల నివాళి

2లో



# తొలుత మూడు మండలాల్లో భూభారతి

హైదరాబాద్: రాష్ట్రంలో భూభారతి పోర్టల్‌ను తొలుత ఎంపిక చేసిన మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సేవలను విస్తరించనున్నారు. పోర్టల్‌ను ఈ నెల 14న (సోమవారం) ప్రారంభించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం తన నివాసంలో సమీక్ష నిర్వహించి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపైనా ఆయన సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారం, లావాదేవీలకు సంబంధించిన సమాచారం రైతులకు, ప్రజలకు సులభంగా, వేగంగా అందుబాటులో ఉండేలా పోర్టల్‌ను రూపొందించామని సీఎం తెలిపారు. భూభారతి ప్రారంభోత్సవం అనంతరం రాష్ట్రంలో మూడు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజలకు, రైతులకు పోర్టల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా సదస్సుల్లో ప్రజల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని మండలాల్లోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. పోర్టల్ బలోపేతానికి ప్రజల నుంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. వెబ్‌సైట్‌తోపాటు యాప్‌ను పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. అత్యంత నిరుపేదలు, అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని, ఇందిరమ్మ కమిటీలు రూపొందించిన జాబితాను మండల అధికారులతో కూడిన బృందం క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎవరైనా దందాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. అనర్హులు ఎవరైనా ఇల్లు పొంది నిర్మించుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు వారు పొందిన మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు మంజూరైన ఇంటికి వారి సౌలభ్యం ఆధారంగా విలువలో అదనంగా 50% మేర నిర్మించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. లబ్ధిదారులకు ఆర్థికపరమైన ఊరట కల్పించేందుకు సిమెంటు, స్టీల్ తక్కువ ధరలకు అందేలా చూడాలని సీఎం తెలిపారు. సమీక్షలో మంత్రి పొంగులేటి, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి, రెవెన్యూశాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, సీసీఎల్‌ఏ కార్యదర్శి మకరంద్, సీఎం ప్రధాన కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం జాయింట్ సెక్రటరీ సంగీత సత్యనారాయణ, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, భూచట్టాల నిపుణుడు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మరలిపోయిన వనరుషి



ఖమ్మం : మొక్కలు నాటడానికి, చెట్ల సంరక్షణకు తన జీవితాన్ని ధారపోసిన అసాధారణ ప్రకృతి ప్రేమికుడు, పచ్చని వనాల కోసం ఐదు దశాబ్దాలపాటు పరితపించిన మహనీయుడు... ఇంటి పేరునే వనజీవిగా మార్చుకున్న పద్మశ్రీ గ్రహీత దరిపల్లి రామయ్య (79) ఖమ్మం గ్రామీణ మండలం రెడ్డిపల్లిలోని తన స్వగృహంలో శనివారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తెల్లవారుజామునే కుటుంబ సభ్యులు ఆయన్ను నిద్రలేపగా కదలిక లేకపోవడంతో తక్షణమే ఖమ్మం సర్వజనాసుపత్రికి తరలించారు. అప్పటికే రామయ్య మృతి చెందినట్లు ఆ ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెడ్డిపల్లికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. అంత్యక్రియలను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఆ రోజు నేను లేనట్లే లెక్క!

రామయ్య 1946 జులై 1న జన్మించారు. వనజీవి రామయ్య, జానమ్మ దంపతులకు ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. గతంలో అనారోగ్యంతో ఇద్దరు కుమారులు మృతి చెందారు. భార్య, చిన్న కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామయ్య తన ఐదో ఏట నుంచే రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం మొదలుపెట్టారు. కొండలు, గుట్టలపై విత్తనాలు చల్లేవారు. ప్రధానంగా భార్య జానమ్మ సహకారంతో ఐదు దశాబ్దాల నుంచి ఈ ప్రక్రియను ప్రతిరోజూ ఒక యజ్ఞంగా కొనసాగించి... కోటికి పైగా మొక్కలు నాటారు. గుండెకు శస్త్రచికిత్స చేసినా విశ్రమించలేదు. 'మొక్క నాటని రోజు నేను మరణించినట్టే లెక్క' అని ఎన్నో వేదికలపై వ్యాఖ్యానించడం గమనార్హం. తన కుమారుడు, కుమార్తె వివాహాల శుభలేఖలపై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ముద్రించారు. తన మనుమరాళ్లకు కబంధ పుష్పం, చందన పుష్పం, వనశ్రీ, హరితారణ్య అనే పేర్లు పెట్టి ప్రకృతిపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా బెంగళూరుకు చెందిన అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే సంస్థ 2013 ఏప్రిల్ 8న డాక్టరేట్ ప్రదానం చేసింది. 2017 మార్చి 30న నాటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. అప్పట్లో ప్రధాని మోదీ.. "రామయ్యా భావితరాలకు గుర్తుంటావయ్యా" అంటూ ప్రశంసించారు.

### ఇక మొక్కలెవరు నాటుతారు నాన్నా?

"మాకు ప్రకృతి పాఠాలు నేర్పి తిరిగిరాని లోకాలకు పయనమయ్యావా నాన్నా.. ఇప్పుడు మొక్కలు ఎవరు నాటుతారు.. వాటికి నీళ్లుపోసి ఎవరు సంరక్షిస్తారు" అంటూ రామయ్య పిల్లలు విలపిస్తున్నారు. భార్య జానమ్మ మాట్లాడుతూ... "వనజీవి భార్యగా ఆయన ఆశయాలు, సేవల్లోనూ భాగస్వామినయ్యా. కుటుంబం కంటే సామాజిక సేవకే ఆయన అధిక ప్రాధాన్యమిచ్చారు. వనజీవి పేరిట స్మృతివనం ఏర్పాటుచేసి భావితరాలకు ఆయన గురించి తెలియజేయాలి" అని ఆకాంక్షించారు.

## వైభవంగా ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు



తిరుమల : తిరుమలలోని శనివారం సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు వసంతోత్సవ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామితోపాటు శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివార్లకు వసంతోత్సవ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడ సేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా తితిదే రద్దు చేసింది. కార్యక్రమంలో జీయంగార్లు, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్ల, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## దిల్లీలో గాలిదుమారం

(మొదటిపేజీ తరువాయి)

దీంతో విమానాల రద్దీ నెలకొంది. దీంతోపాటు ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు ఆలస్యమయ్యాయి. విమానాల ట్రాకింగ్ వైబ్‌సైట్ ఫ్లైట్‌ట్రేడర్24.కామ్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం 450కిపైగా విమానాలు ఆలస్యమయ్యాయి. ఒక్కో విమానం టేకాఫ్ సగటు ఆలస్యం 50 నిమిషాలకు పైగా ఉంది. 18 విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దిల్లీలో కొనసాగుతున్న విమాన ట్రాఫిక్ రద్దీ కారణంగా టేకాఫ్, ల్యాండింగ్ క్లియరెన్స్ ఆలస్యమవుతోందని 'ఎక్స్'లో ఇండిగో సంస్థ ప్రకటించింది. తమ సిబ్బంది సర్వీసులను మెరుగుపరుస్తున్నారని దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) శనివారం 'ఎక్స్'లో వెల్లడించింది. సాయంత్రం 7.19 గంటలకు విమానాలన్నీ సమయానికి నడుస్తున్నాయని మరో పోస్టు పెట్టింది

## వైభవంగా .. హనుమాన్ జయంతి

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులో పేర్కొన్నారు. దిల్లీలోని సున్నిత ప్రాంతమైన జహంగీర్‌పురి ప్రాంతంలో విశ్వ హిందూ పరిషత్ ఊరేగింపు నిర్వహించేందుకు శాంతిభద్రతల రీత్యా పోలీసులు నిరాకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ పట్టణంలో భారీ హనుమాన్ జయంతి ఊరేగింపు నిర్వహించారు. వారణాసిలో ఆలయాలు అందమైన అలంకరణలతో దర్శనమిచ్చాయి. పశ్చిమబెంగాల్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య భాజపా నాయకులు హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. తేనెటీగల దాడి: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో హనుమంతుని జన్మస్థలంగా ప్రసిద్ధమైన అంజనేరిలో తేనెటీగలు దాడిచేయడంతో పలువురు భక్తులు గాయపడ్డారు. అంజనేరి కొండపై భక్తుల రద్దీ బాగా పెరిగిన పరిస్థితిలో తేనెటీగల దాడి జరిగింది.

## రద్దీ రోడ్డుపై ఆవుకు రొట్టె విసిరిన వ్యక్తి..

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ముఖ్యమంత్రి రేఖాగుప్తా చేసిన పని అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. రద్దీగా ఉన్న రోడ్డుపై ఆవుకు ఆహారం విసిరేయడం చూసిన ఆమె...వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. ఆ వ్యక్తి వద్దకు వచ్చి ఇలా ఇంకోసారి చేయొద్దని చేతులు జోడించి విజ్ఞప్తిచేశారు. దిల్లీలోని హైదర్‌పూర్ ఫ్లైఓవర్‌పై శనివారం ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించిన వీడియోను సీఎం శనివారం తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. "రొట్టె కేవలం ఆహారం మాత్రమే కాదు.. మన సంస్కృతి, సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీక. ఇలా రద్దీగా ఉన్న రోడ్లపైకి ఆహారాన్ని విసిరేయడం వల్ల వాటిని తినేందుకు ఆవులు, ఇతర జంతువులు అక్కడికి వస్తాయి. అప్పుడు మూగజీవులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఇది వాహనదారులు, రోడ్లపై నడిచే వారికీ ప్రమాదమే. అంతేకాదు.. ఆహారాన్ని ఇలా అగౌరవపర్చకూడదు. దిల్లీ వాసులందరికీ నా అభ్యర్థన ఒక్కటే. రోడ్లపై ఆహారాన్ని విసరొద్దు. మూగజీవాలను ప్రేమించండి. మన సంస్కృతిని గౌరవించండి. రహదారి భద్రతను పాటించండి" అని రేఖా గుప్తా రాసుకొచ్చారు.

## సర్కారుకే సన్నాలు!

(మొదటిపేజీ తరువాయి)

రైతులు వ్యాపారులకు విక్రయానికే మొగ్గు చూపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. రబీ సీజన్‌లో ధాన్యం అమ్మకాలకు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే వెళుతున్నారు. నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి తదితర జిల్లాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటమే ఖరీఫ్‌లో బోనస్ రావడంతో..

వానాకాలం సీజన్‌లో బోనస్ పథకంపై స్పష్టత విషయంలో ఒకింత ఆలస్యమైంది. ఆ సీజన్‌లో 4.48 లక్షల మంది రైతులు 23.98 లక్షల టన్నుల సన్నధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించారు. బోనస్ రూపంలో రూ.1199.22 కోట్లు పొందారు. యాసంగిలోనూ బోనస్ ఇస్తామని చెప్పడంతో.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే రైతులు తరలిస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ రబీ సీజన్‌లో 70.13 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

కొనుగోలు కేంద్రాలకు 46.71 లక్షల టన్నుల (66 శాతం) దొడ్డు ధాన్యం, 23.42 లక్షల టన్నుల (34 శాతం) సన్నధాన్యం వస్తాయని అంచనా వేసింది. వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యంలో సన్నాలు భారీగా ఉంటున్నాయి. నాలుగింట మూడొంతులు సన్నధాన్యం కాగా, ఒకవంతు మాత్రమే దొడ్డు ధాన్యం ఉంటున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకూ దొడ్డురకం 0.36 లక్షల టన్నులు (రైతులు 4,382 మంది), సన్నరకం 1.54 లక్షల టన్నుల (రైతులు 14,966 మంది)ను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సేకరించింది. సన్నరకం ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్ రూ.17.97 కోట్లుగా ఉంది. రాష్ట్ర బడ్జెట్‌లో సన్నబియ్యం బోనస్‌కు ప్రభుత్వం రూ.1,358.46 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలకు అంచనాలకు మించి వస్తున్న సన్నధాన్యం లెక్కలను చూస్తుంటే బోనస్‌కు చెల్లించాల్సిన మొత్తం రూ.2 వేల కోట్లు దాటే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### వ్యాపారులు తిరుగుముఖం..

కర్ణాటకతో పాటు రాష్ట్రంలోని మిర్యాలగూడ ప్రాంత రైస్ మిల్లుల వ్యాపారులు ప్రతి సీజన్‌లో నిజామాబాద్ సహా పలు జిల్లాలకు వచ్చి పచ్చి ధాన్యాన్ని (సన్నాలు) కొనుగోలు చేస్తుంటారు. మొదట్లో కొందరి వద్ద ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయటం.. ధాన్యం ఎక్కువ మొత్తంలో వచ్చే సమయానికి ధర తగ్గించడం చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వమే మద్దతు ధరకు తోడు బోనస్ ఇస్తుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపే చూస్తున్నారు. ఈ మార్పును చూసి ప్రైవేటు వ్యాపారులు వెనుతిరుగుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

## మదురై తరహాలో భద్రకాళి ఆలయం

(మొదటిపేజీ తరువాయి)

మాడవీధుల డిజైన్‌లను ఖరారు చేశారు. ప్రస్తుతం దేవాలయం చుట్టూ మాడవీధుల అభివృద్ధికి ఖాళీ స్థలాలను చదును చేసే పనులు సాగుతున్నాయి. మరోవైపు ఆలయం నాలుగువైపులా రాజగోపురాలను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.24 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. మదురైతోపాటు తంజావూరుకు చెందిన స్థపతులతో త్వరలోనే దేవాదాయ శాఖ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నారు. భద్రకాళి అమ్మవారి విగ్రహం 9 అడుగుల వెడల్పు, 9 అడుగుల పొడవుతో పశ్చిమాభిముఖంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో 5 వేల మంది భక్తులు వస్తుండగా ఏడాదికి నాలుగుసార్లు జరిగే ఉత్సవాలు, ప్రత్యేక రోజుల్లో 15 వేల మంది వరకు అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయం చరిత్ర అందరికీ తెలిసేలా నిర్మాణాలు ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది. క్రీ.శ.1323లో కాకతీయ సామ్రాజ్యం పతనానంతరం 625 ఏళ్లు ప్రాభవం కోల్పోయిన ఆలయానికి పునర్వైభవం కల్పించేలా 1948లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బీఎస్ గణేశ్‌శాస్త్రి దాతల సహకారంతో పునరుద్ధరణ చేశారు. 1986లో దక్షిణ భారత ఆలయాల సంప్రదాయాలకనుగుణంగా ఆలయ శిఖరం, మహామండపం, సాలహారాలను నిర్మించారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

## రాజధానికి రుణాలిచ్చేందుకు బ్యాంకుల ఆసక్తి

అమరావతి: జగన్ ప్రభుత్వ విధ్వంసంతో తీవ్రంగా దెబ్బతిన్న అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే పూర్తిస్థాయిలో పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైంది. అమరావతి పనులు మళ్లీ పట్టాలకెక్కడం, రాజధాని నిర్మాణాన్ని సర్కారు వేగంగా పూర్తి చేస్తుందన్న నమ్మకం కుదరడంతో రాజధానికి రుణాలిచ్చేందుకు పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ముందుకు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చొరవతో ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీలు కలిసి రూ.15,000 కోట్లు, హడ్కో రూ.11,000 కోట్ల రుణం మంజూరు చేయగా.. జర్మనీ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ కూడా రూ.5 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. వీటితో పాటు ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐల కన్సార్షియం, పలు ఆర్థిక సంస్థలు సైతం రుణాలు ఇవ్వడానికి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశాయి.

### ఇప్పటికే రూ.26 వేల కోట్లు సిద్ధం

రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం, ప్రధాన మౌలిక వసతులు (ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), రాజధానికి భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్‌పీఎస్ లేఅవుట్‌ల అభివృద్ధి, వరద నివారణ చర్యలు, కాలువలు, జలాశయాల అభివృద్ధి వంటి పనుల్ని 92 ప్రాజెక్టులుగా విభజించిన సీఆర్‌డీఏ.. వాటికి మొత్తంగా రూ.65 వేల కోట్లు అవసరమవుతుందని అంచనా వేసింది. అందులో ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్లు, హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు కలిపి రూ.26 వేల కోట్ల రుణం మంజూరు కాగా.. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.4,285 కోట్లు, హడ్కో ద్వారా రూ.553.17 కోట్లు అడ్వాన్స్‌గా వచ్చాయి. అలాగే జర్మనీ బ్యాంకు కేఎఫ్‌డబ్ల్యూతో రూ.5 వేల కోట్ల రుణానికి సంబంధించి సీఆర్‌డీఏ త్వరలో ఒప్పందం చేసుకోనుంది. మరోవైపు ఇప్పటి వరకు రూ.42,150 కోట్ల విలువైన 68 పనులకు టెండర్లు పిలిచింది. మిగతా ప్రాజెక్టులకూ దశలవారీగా వాటిని పిలవనుంది.

### పెట్టే ప్రతిరూపాయినీ తిరిగి సమకూర్చుకునేలా..

రాజధాని నిర్మాణానికి పెట్టే ప్రతి రూపాయినీ అక్కడి నుంచే తిరిగి సమకూర్చుకునేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అమరావతిలో ప్రధాన మౌలిక వసతుల కల్పనకు, ఎల్‌పీఎస్ లేఅవుట్‌లకు, పరిపాలన నగర నిర్మాణానికి, వివిధ సంస్థలకు కేటాయించేందుకు అవసరమైన భూమిని తీసేస్తే... సీఆర్‌డీఏ దగ్గర నికరంగా 3,500 ఎకరాల భూమి మిగలనుంది. దాన్ని తనఖా పెట్టడం, భవిష్యత్తులో దశలవారీగా విక్రయించడం, బాండ్‌లు జారీ చేయడం ద్వారా రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల్ని సీఆర్‌డీఏ సమకూర్చుకోవాలన్నది ఆలోచన.

## రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతికీ గడువు!

దిల్లీ: శాసనసభలు ఒకటికి రెండు సార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ నెల 8న సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 415 పేజీల ఆ తీర్పులోని పూర్తి వివరాలు శుక్రవారం రాత్రి సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి వచ్చాయి.

### తీర్పులోని ముఖ్యమైన అంశాలు

* కేసు విచారణ సందర్భంగా కేంద్ర హోంశాఖ సూచించిన 3 నెలల వ్యవధిని.. పరిశీలన నిమిత్తం గవర్నర్లు పంపించిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువుగా విధించడం సముచితమని భావించినట్లు ధర్మాసనం తెలిపింది.
* బిల్లుల ఆమోదానికి ఈ కాల వ్యవధిని మించి జాప్యం జరిగితే అందుకు గల కారణాలను నమోదు చేయాలి.
* రాష్ట్రపతి పరిశీలన కోసమంటూ బిల్లును గవర్నరు రిజర్వులో ఉంచడం, రాష్ట్రపతి కూడా సమ్మతి తెలపకుండా తన వద్దే నిలిపివేయడం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం నిస్సంకోచంగా సుప్రీంకోర్టులో సవాల్ చేయవచ్చు.
* బిల్లులకు ఆమోదం తెలిపే, తిరస్కరించే, రాష్ట్రపతికి పంపించే అధికారాన్ని గవర్నర్లకు రాజ్యాంగ అధికరణం 200 కల్పించింది. దాని అర్థం బిల్లులపై ఎప్పటికీ నిర్ణయం తీసుకోకుండా ఉండమని కాదు. రాష్ట్రాల్లో శాసన నిర్మాణ వ్యవస్థను స్తంభింపజేయమనీ కాదు. అకారణంగా బిల్లులను సుదీర్ఘకాలం నిలిపి ఉంచడం సరికాదని పంజాబ్ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది.
* మంత్రి మండలి సిఫార్సులను ఆమోదించడం రాష్ట్ర గవర్నర్ విధి. రెండోసారి కూడా ఆమోదించి పంపిన బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసమని నిలిపి ఉంచడం లేదా నివేదించడం భావ్యం కాదు.
* ప్రస్తుతం నిర్దేశించిన కాలవ్యవధిలోగా బిల్లులపై ఎటువంటి నిర్ణయం తీసుకోని గవర్నర్ల నిష్క్రియాపరత్వంపైనా న్యాయసమీక్ష అధికారం కోర్టులకు ఉంటుంది.

# రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యం

*** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జై బాపూ,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం 9వ రోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని27,28,29,30వ డివిజన్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి డివిజన్లకు కాలినడకతో ప్రజల మధ్యకు వెళ్లి మన దేశం గొప్పతనం మన రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే ఈ కార్యక్రమానికి మాతోపాటు మీరందరూ పాల్గొని మీ వంతు బాధ్యతను మీరు నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ మీకు మేమున్నాం అనే హామీని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడియాల ఇందిరా, జ్యోతి,సీనియర్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి ఏలూరు సత్య (నాని), లింగాల గంగాధర్, కృష్ణమరాజు,మామిళ్ళపల్లి శ్రీనివాస్, పంగా శ్రీనివాసరావు, వరగాని వాసు, అంజాద్,మల్లికార్జున్,లడ్డు,సాయిరాజ్,శ్రీనివాస్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్,హర్యానాయక్,శ్రీశైలం యాదవ్, నారాయణరెడ్డి, జగ్గా మధుసూదన్ రెడ్డి, గూడూరు మురళి ,రఫత్,కోటేశ్వరి,శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), ప్రభాకర్ రెడ్డి, సత్తిరెడ్డి, నరసింహారెడ్డి, హరిబాబు, సురేందర్,రఘు, ప్రేమ్ కుమార్, సురేష్ యాదవ్, పితాని శ్రీనివాసరావు, బాలకృష్ణ, లక్ష్మణ్, నర్సింగ్, గిరీష్, సురేష్, మహిపాల్, అల్లాడి మహేష్,దినేష్, గౌస్,కిషోర్, గోపాల్ ,రామానాయుడు, కృష్ణ,క్రాంతి, తులసీదాస్,లోకనాథం, సురేందర్, సుబ్బు, ఆంజనేయ వర్మ, రమేష్, సత్యనారాయణ రెడ్డి,యాదయ్య,గోలి శ్రీను, సరిత రెడ్డి,మార్తమ్మ, నగీన, ధనలక్ష్మి, రమా,ఎం సత్యవతి, ఎన్ సత్యవతి, స్వరూప, శ్రీదేవి, యశోద, గిరిజ కుమారి,లక్ష్మమ్మ,కరుణ, సునీత, లక్ష్మి, నవ్య, లక్ష్మి, కాళీమా, విజయలక్ష్మి,రమేష్, సుబ్బిరామిరెడ్డి, ఫిలిప్స్, కుమార్,జి కృష్ణ,రాజు యాదవ్,పుల్లయ్య,యాదయ్య , మాజీ కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా... హనుమాన్ విజయోత్సవ ర్యాలీ



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 12: జిన్నారం గ్రామంలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్ దేవాలయంలో అభిషేకం,చందన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిందూ జాగరణ సమితి, హనుమాన్ ఆలయ కమిటీ, స్థానిక నాయకులు, యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి జిన్నారం,పెద్దమ్మగూడ, ఉట్ల ,మంగంపేట,జంగంపేట లోని పలు వీధుల గుండా జై హనుమాన్ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి మండల అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి టెంట్ శ్రీనివాస్,ఉపాధ్యక్షులు బ్రహ్మేంద్రర్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలలో ముందుకు సాగుదాం

*** సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అమరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలలో ముందుకు సాగుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక మంచికంటి భవన్లో సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యులు మాకినేని బసవపు పున్నయ్య భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా బుజ్జి లవర్ధంతి మరియు ప్రజా కళాకారుడు సఫ్దర్ హస్మి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి మచ్చ వెంకటేశ్వర్లు నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్షసాన్ని భారతదేశ ప్రజలకు పరిస్థితులకు అన్వయించి ముందుకు తీసుకెళ్లడంలో ఎంబి కీలక పాత్ర పోషించారన్నారు. భద్రాచలం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి గొప్ప పరిపాలన దక్షుడుగా కుంజా భోజి పని చేశారని అన్నారు.. తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండా బాటలోనే సాదాసీదా జీవితాన్ని గడిపి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అమరవీరులు ప్రజల కోసం నిరంతరం పరితపిస్తూ వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేశారని అలాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు డి వీరన్న, నందిపాటి రమేష్, నాయకులు బాలకృష్ణ , రాములు, సంధ్య, రామకృష్ణ, సలీం, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా వీర హనుమాన్ శోభాయాత్ర



ప్రజాస్ఫూర్తి, యాదాద్రి భువనగిరి జిల్లా : భువనగిరి పట్టణం విశ్వహిందూ పరిషత్ బజరంగదళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయత్ర శోభయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భువనగిరి పెరుమాండ్ల హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభమై భువనగిరి పట్టణంలో పురవీధుల గుండా తిరిగి జగదేవపూర్ రోడ్డులో గల అంజనాద్రి హనుమాన్ దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా విచ్చేసిన హనుమాన్ కథ ప్రవక్త సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ అడికే కార్తీక్, భువనగిరి డిసిపి అక్షాన్స్ యాదవ్ లు పాల్గొని శోభయాత్రను ప్రారంభించి పెరుమాండ్ల హనుమాన్ దేవాలయం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో . బజరంగదళ్ యాదాద్రి జిల్లా కన్వీనర్ బింగి భరత్ కుమార్ , విశ్వహిందూ పరిషత్ భువనగిరి జిల్లా అధ్యక్షులు పోత్నక్ రాఘవేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోల శ్రీనివాస్ గుప్తా, భువనగిరి జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్, జిల్లా కోశాధికారి చామ రవీందర్, మాతృశక్తి యాదాద్రి జిల్లా కన్వీనర్ అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు పసునూరి మనోహర్, సామాజిక సమరసత కన్వీనర్ కేమోజు, మల్లికార్జున చారి, లీగల్ సెల్ కన్వీనర్ సాల్వేరు వేణు, సత్సంగ్ ప్రముఖ్, పెద్ద గాని శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కందికొండ సహదేవ్, భువనగిరి అంజయ్య, అర్చక పురోహిత జిల్లా ఆకుల అనిల్, వల్లబోజు సతీష్, రెడ్డబోయిన బాలరాజు, వివిధ ప్రఖండల అధ్యక్ష కార్యదర్శులు బజరంగ్దళ్ సహ సంయోజక్ మార్క శ్రవణ్ నగర సంయోజక్ నమిలే నవీన్, బజరంగ్దళ్ కార్యకర్తలు మేకల భాను, జడల అక్షయ్. అవినాష్ పూస శ్రీనివాస్ కుచ్చుల గోపి అరుణ్ కుచ్చుల రాఖి ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ హిందువాహిని ఏబీవీపీ ముఖ్య కార్యకర్తలు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలో ఎవరు అడ్డుపడిన బిజెపి ఊపు ఆగదు

*** బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్**



రాజపేట, ప్రజా స్ఫూర్తి : తెలంగాణలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని కార్యకర్తలంతా ముక్తకంఠంతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు.రాజాపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గావ్ చలో బస్తి చలో కార్యక్రమం శనివారం నిర్వహించారు. గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్లు ఊడ్చి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బిజెపి అల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ అబయ్ పాటిల్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అవినీతిలోకి కూరుకు పోయిందని, అతి తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత కూడా కట్టుకున్నదని అన్నారు. తెలంగాణలో బిజెపి పాగా వేయకుండా కాంగ్రెస్ అడ్డుపడుతోందని కానీ ఎప్పుడో బిజెపి 8 మంది ఎంపీలతో పాగా వేసిందన్నారు. బూత్ కార్యకర్తలు పని తోటే దేశవ్యాప్తంగా గల్లీ గల్లీకి బిజెపి పాకిందన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా బిజెపి కి కార్యకర్తలు పనిచేస్తున్నారని ప్రభుత్వ ఏర్పాటుకు మరింత కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల అధ్యక్షులు మేకల రమేష్, భూత్ అధ్యక్షులుసోమసాని చంద్రం, బిర్రు సురేష్, చిగుళ్ల బీరప్ప, సంగెం మధు, సీనియర్ కార్యకర్తలు ఎసిరేడ్డి రాజశేఖర్ రెడ్డి, సోమసాని అశోక్, కాసోజు సంపత్, గాండ్ల నర్సింగరావు, దాచేపల్లి శ్రీనివాస్, ఎక్కలదేవి శ్రీనివాస్, బూర్గు శేఖర్ రెడ్డి ఎర్రగోకుల వినోద్, మెండు భగవాన్ రెడ్డి, ఐరెని శ్రీధర్, జెన్నసిద్ధులు, ప్రధాన కార్యదర్శి కోయ మధు, కోయ ఉపేందర్, చింతం వేణు, దిడ్డి సత్యనారాయణ,గొట్టిపాముల సాయి, ఎక్కలదేవి శ్రీహరి, పొన్న సంతోష్, దిడ్డి నర్సింహులు, మహ్మద్ ఖాజా, నాగపురి ప్రవీణ్, కోయ హరినాథ్, పాల్గొన్నారు. అబ్బాయి పాటిల్ రాజపేటకు వచ్చిన సందర్భంగా పార్టీ పక్షాన ఉట్కూరు అశోక్ గౌడు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల కడుపు నింపేందుకు సన్న బియ్యం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పేదల కడుపు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ చేపడుతుందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బదావత్ గోవర్ధన్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని మోర్రాపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్, బదావత్ నర్సింహ, బదావత్ రవి కుమార్, రమావత్ సురేందర్ తదితరులున్నారు

## ఘనంగా ముగిసిన విగ్రహాల పునః ప్రతిష్ట మహోత్సవాలు



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో మూడు రోజులపాటు కొనసాగుతున్న శ్రీ గణపతి శ్రీ అభయాంజనేయ స్వామి వార్ల విగ్రహాల పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ఉత్సవ కమిటీ, చల్లూరు గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా సాగింది. శనివారం సుప్రభాతంతో ప్రారంభమై మూల మంత్రం, యంత్ర ప్రతిష్ట, బలిహరణ, మహా పూర్ణాహుతి,మహా కుంభాభిషేకం, శ్రీ గణపతి శ్రీ అభయాంజనేయ స్వామి సహస్రనామ ఆకు పూజ శ్రీ సీతారామస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలు కన్నుల పండుగగా సాగాయి. కార్యక్రమం కురువతి శ్రీనివాసచార్య ఆధ్వర్యంలో సాగింది. అంతకుముందు మూడు రోజులపాటు శాంతి బలిహరణ,అఖండ దీపారాధన, జలాధివాసం, విష్ణు సహస్రనామ పారాయణం, సుందరకాండ పారాయణం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ముగింపు రోజు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేయగా నిర్వాహకుల సత్కరించారు. తాజా మాజీ సర్పంచి వంచ వీరారెడ్డి స్నేహలత రెడ్డి దంపతులతో పాటు గ్రామంలోని భక్తులు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## దేశాన్ని ముక్కలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం

*** కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొట్టి విభజించి పాలించు తత్వంతో దేశాన్ని ముక్కలు చేస్తుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని రాంరెడ్డిపల్లె , కొండాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై బీమ్, జై సంవిదాన్ యాత్ర శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి హాజరై ముందుగా మహానీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి, యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ సర్కారు సామాన్యుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ ధనవంతులకే మద్దతు ఇస్తోందని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే చర్యలకు పాల్పడుతోందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ అన్నది కేవలం ఒక నినాదం కాదు, ప్రతి భారత పౌరుడి బాధ్యతని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పౌరుడు రాజ్యాంగ పరిరక్షణ కోసం సంఘటితంగా పోరాటం చేయాలని, సమానత్వం, స్వేచ్ఛ, బంధుత్వం విలువలను కాపాడుకుంటూ, బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను కాపాడడంతో పాటు ప్రజలకు స్వేచ్ఛ ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ కార్యక్రమాన్నికి పిలుపునిచ్చారని తెలిపారు. రాజ్యాంగం పట్ల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా యాత్రను మొదలు పెట్టిందని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించారని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుంటూ జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ నినాదంతో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. గత పాలకుల పరిపాలనాతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రజా పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజపేట మండలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

* ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్న బీర్ల ఐలయ్య
* గ్రామ గ్రామాన ఘన స్వాగతం పలికిన ప్రజలు





రాజపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పాల్గొన్నారు..రాజపేట మండలం కొత్తజాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మీపతి రోడ్డు ప్రమాదంలో గాయపడగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పాముకుంట గ్రామంలో సిసి రోడ్డును, మల్లగూడెం గ్రామంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి,సీసీ రోడ్డును, నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. సింగారం గ్రామంలో సీసీ రోడ్డును,బూర్గు పల్లి,బొందుగుల, గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. బొందుగుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సంధర్భంగా ముందుగా అమ్మవారి అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గాంధీజీ ,అంబెడ్కర్ ,రాజ్యాంగన్నీ చేతిలో పట్టుకొని గ్రామంలో ఉన్న వార్డుల్లో ర్యాలీ గా తిరుగుతూ వారి విలువలను ప్రజలకు తెలియజేసారు.ఈ సందర్భంలో సీసీ రోడ్డు ను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న సన్న బియ్యంతో * ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నిరుపేద కుటుంబ తో కలసి భోజనం చేశారు.గోళ్ళూరి కుమార స్వామి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సన్నబియ్యం ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.తెలంగాణ లో ప్రజాప్రభత్వం ఏర్పాటు అయినప్పటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.రూ.500 లకే గ్యాస్, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం లాంటి పథకాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. బొందుగుల గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాలను *తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబెడ్కర్, జగ్జీవన్ రామ్ , విగ్రహాలను ఆవిష్కరించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బడుగు బలహీన వర్గాల గొంతుక స్వాతంత్ర సమర యోధుడు ఉత్తమ పార్లమెంటరియంగా,ఉపప్రదనిగా,భారత దేశానికి సేవలందించిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహలను బొందుగుల గ్రామంలో ఇంత ఘనంగా ఆవిష్కరించుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కుల మత ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగఫలాలు అందరికీ అందాలన్న మహనీయుల ఆశయ సాధనకు అందరం కృషి చేయాలన్నారు. అట్టడుగు వర్గాలకు సమాన హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమన్నీ చేపట్టిందన్నారు. ఓ బిడ్డగా ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించిన బొందుగుల గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు, తపాస్ పల్లి, రిజర్వాయర్ నుండి బొందుగుల గ్రామానికి నీళ్లు తీసుకొని వచ్చారని రాబోయే రోజుల్లో కూడా రాజపేట మండలంలోని మల్ల గూడెం చెరువు నుండి రాజపేట మండలంలోని అన్ని చెరువులకు నీరు అందించి రాజపేట మండలాన్ని సస్యశ్యామలం చేస్తానని అన్నారు. తహసిల్దార్ ఇంద్రకర్ అనిత ఎంపీడీవో నాగవేణి, ఇతర అధికారులు, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఇంజ నరేష్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిల్వేరు బాలరాజు గౌడ్, మాలోత్ విఠల్ నాయక్, మేడిశెట్టి సురేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రాంజీ నాయక్, నమిల కేదారి గౌడ్, అంకతి బాలయ్య, బొడ్డుల నగేష్, రావుల హరిబాబు, రంగ నరేష్, బాల్ద శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : హనుమాన్ జయంతి సందర్భంగా జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ఆ భజరంగభళీ కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి అందరినీ చల్లగా చూడాలన్నారు. ఆంజనేయస్వామి ప్రజలందరిని అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో జీవించేలా చల్లంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, కాలే నాగేష్, కాలే గణేష్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, సంపత్ గౌడ్, బాల మల్లేష్, శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య అనేది ఎంతో కీలకం

* బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య అనేది ఎంతో కీలకమని భవిష్యత్తును బంగారు మయంగా మార్చుకునేందుకు ఇది అత్యంత కీలకమైన సమయమని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ స్వాగత్ గ్రాండ్ నందు "శ్రీ చైతన్య అకాడమీ" ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జేఈఈ & నీట్ పరీక్షలల్లో విజయం సాధించేందుకు ఏ విధంగా సన్నద్ధం కావాలో తెలియజేస్తూ ఏర్పాటుచేసిన మోటివేషనల్ సెమినార్ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుదేశించి ప్రసంగించారు. రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే ఎప్పటికప్పుడు మనల్ని మనం అప్రేడ్ చేసుకుంటూ ఉంటేనే అనుకున్న లక్ష్యాలను సాధించగగలమన్నారు. కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, సమ్మయ్య నేత, సంపత్ గౌడ్, కాలే గణేష్, బాల మల్లేష్, శ్రీకాంత్, ఇన్ఫినిటీ లెర్న్ సీఈవో ఉజ్వల్ సింగ్, ఇన్ఫినిటీ లెర్న్, శ్రీ చైతన్య అకాడమీ సిఓఓ శేషగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం బూత్ అధ్యక్షులే కీలకం

* రాజపేట కార్యక్రమంలో ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ అభయ్ పాటిల్



రాజపేట, ప్రజా స్ఫూర్తి : బిజెపి పట్ల,మోడీపై ఉన్న అభిమానాన్ని ప్రతి ఓటరు ఓటు వేసేలా బూతు స్థాయి అధ్యక్షులు నాయకులు నిరంతరం శ్రమించాలని, ప్రభుత్వ పథకాలు, పార్టీ ఉద్దేశాలను వివరించాలని బిజెపి జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ అభయ్ పాటిల్ అన్నారు. రాజపేటలో రెండు రోజులు శుక్ర, శనివారాలు అభయ్ పాటిల్ పర్యటన సాగగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అతిథి గృహంలో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాత్రి రేణిగుంట రెవెన్యూ పరిధిలోని శ్రీ సంకల్ప సిద్ది శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిద్ర చేసి శనివారం ఉదయం రాజపేట లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు మూడు గంటల పాటు ప్రధాన రోడ్లను శుభ్రం చేశారు చెత్తను తొలగించారు. అభయ్ పార్టీల్ వెంట రాజపేట పట్టణ బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ పరిస్థితి పట్ల కార్యకర్తలు నాయకుల నిర్వహణ పట్ల అభయ్ పాటిల్ సంతోషం వ్యక్తం చేసి మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ నాయకత్వం వహిస్తున్న జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ ను ప్రత్యేకంగా అభినందించారు. బిజెపి పార్టీ రాజపేటలో ఆదర్శంగా ఉందన్నారు. రాజాపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గావ్ చలో బస్తి చలో కార్యక్రమం నిర్వహించారు. గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్లు ఊడ్చి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బిజెపి అల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ అబయ్ పాటిల్ అంబేద్కర్ విగ్రహాన్ని నీటితో శుభ్రంగా కడిగి పూలమాల వేసి వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, రాజాపేట మండల అధ్యక్షులు మేకల రమేష్, భూత్ అధ్యక్షులుసోమసాని చంద్రం, బిరు సురేష్, చిగుళ్ల బీరప్ప, సంగెం మధు, సీనియర్ కార్యకర్తలు ఎసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సోమసాని అశోక్, కాసోజు సంపత్, గాండ్ల నర్సింగరావు, దాచేపల్లి శ్రీనివాస్, ఎక్కలదేవి శ్రీనివాస్, బూర్గు శేఖర్ రెడ్డి ఎర్రగోకుల వినోద్, మెండు భగవాన్ రెడ్డి, ఐరెని శ్రీధర్, జెన్నసిద్ధులు, ప్రధాన కార్యదర్శి కోయ మధు, కోయ ఉపేందర్, చింతం వేణు, దిడ్డి సత్యనారాయణ, గొట్టిపాముల సాయి, ఎక్కలదేవి శ్రీహరి, పొన్న సంతోష్, దిడ్డి నర్సింహులు, మహ్మద్ ఖాజా, నాగపురి ప్రవీణ్, కోయ హరినాథ్, పాల్గొన్నారు. అభయ్ పాటిల్ పర్యటనతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహము ఆనందం నెలకొంది.

## వనజీవి' కి ఘననివాళి





* వనజీవి రామయ్య మరణంతో తెలంగాణ ఒక ప్రకృతి యోధున్ని కోల్పోయింది

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వనజీవి రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, రామయ్య జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి దాయకమని కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం సభ్యులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలకు వనజీవి చేసిన కృషి అభినందనీయమన్నారు. వనజీవి మరణంతో తెలంగాణ ఒక ప్రకృతి యోధున్ని కోల్పోయిందని తెలిపారు. ప్రపంచ పర్యావరణరక్షణకు రామయ్య మొక్కలు నాటే విధానం అనన్య సామాన్యమన్నారు. హరితహారాన్ని ప్రజల్లోకి తీసు తీసుకెళ్లేందుకు వారు అనుసరించిన విధానం చాలా గొప్పగా ఉందన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిచెప్పిన కోటి మొక్కల ప్రధాత స్ఫూర్తి మరువలేమన్నారు. రామయ్య కృషికి కేంద్రం పద్మశ్రీ అవార్డుతో ఘనంగా సత్కరించింది. ఆయన మరణం పర్యావరణానికి తీరని లోటు. ప్రపంచ పర్యావరణ వేత్తని కోల్పోయాం.ఆయన ఆశయాలను పనికి పుచ్చుకుందాం. చెట్లని ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి,పచ్చదనాన్ని భావి తరాలకు వ్యాప్తి చేసిన వనజీవి మరణించడం ధరిత్రికి తీరని లోటు.కొత్తగూడెంలో 2021, 2022లో నిర్వహించిన ఔషధ మొక్కల ప్రదర్శనకు, ఆరోగ్య మహాసభలకు వచ్చి వారు ఇచ్చిన విలువైన సందేశాన్ని ఈ సందర్భంగాకు గుర్తు చేసుకున్నారు. ఖమ్మంలోనే ఆయన స్వగ్రామం రెడ్డిపల్లి చేరుకొని, ఆయన పార్థివ దేహానికి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఆయనకు నివాళులు అర్పించిన వారిలో పర్యావరణ వేత్త మొక్కల వెంకటయ్య, రాయిలక్ష్మి, ఆశ్రమం కోఆర్డినేటర్ సుగుణారావు, శ్రీరంగం సంపత్ కుమార్, మొక్కల సాంబయ్య, బంగారి శంకర్, హరితమిత్ర దైద వెంకన్న, ప్రకాష్, జైరాజ్ లు ఉన్నారు.

## ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో దేశ ప్రధాన నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను శనివారం దహనం చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై మోయలేని భారం వేసిందని ఆరోపించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ సోషల్ మీడియా జిల్లా చైర్మన్ ఎర్రగోని నవీన్ యాదవ్, పోతగాని శివగౌడ్, మండల అధ్యక్షుడు బోయ నవీన్, డాకోజి అజయ్, బాస్కర్, ఎర్ర శ్రీధర్, బోయ శివ, బుడ్డ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ వరంగల్ సభ విజయవంతం కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ



రాజాపేట , ప్రజా స్ఫూర్తి : ఈనెల 27వ తేదీన వరంగల్ లో జరగబోయే టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభ పోస్టర్ ను శనివారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి రాజపేటలో ఆవిష్కరించారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, పట్టణ అధ్యక్షుడు బెడిదే వీరేశం, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, ఎర్ర గోకుల జస్వంత్, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, జాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : హనుమాన్ జయంతి సందర్భంగా నిజాంపేట్ లో వెలిసినటువంటి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం , శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయాలను శనివారం ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ,ఎన్ ఎం సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కడియాల ఇందిరా, సీనియర్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, ఏలూరి సత్య(నాని), వరగాని వాసు,శ్రీదేవి,నవ్య,రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డినగర్ లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



జగద్గిరిగుట్ట , ప్రజాస్ఫూర్తి : హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్, వెంకట్రామారెడ్డి నగర్, నందనగర్, మారుతి నగర్, విజయ్ నగర్ కాలనీ, గూడన్ మెట్ లలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై రామదూత హనుమాన్ కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలమూ, ధైర్యమూ, పరాక్రమానికి మారుపేరు హనుమాన్ అని అన్నారు. ఆ హనుమంతుడి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం శోభాయాత్ర ర్యాలీని ప్రారంభించి శోభాయాత్ర లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు జల్దా లక్ష్మి నాథ్, కార్తీక్ గౌడ్ , శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు, సందీప్, శివ, నవీన్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అశోక కళాశాలలో ఆర్కిటెక్చర్ విద్య దేశానికే తలమానికం

*** తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అశోక ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్కిటెక్చర్ విద్య అనేది దేశానికే తలమానికగా ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం పరిధిలోని అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ కళాశాల స్నాతకోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ చూచి ప్రజ్వలన చేసి కార్యక్రమమును ప్రారంభించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. పీజీడీఎం (ఏఐ, డీఎస్) విభాగంలో ఏ హైందవి (2022), ఎస్ శివాని (2023), పి హైమావతి (2024) లు బంగారం పథకాలు సాధించారు. వీరికి గవర్నర్ బంగారు పథకాలతో పాటు సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్య అనేది ఒక ఆయుధం లాంటిదని, విద్య ద్వారా ప్రపంచాన్ని జయించవచ్చన్నారు. ఇంజనీరింగ్ విద్యలో నేర్చుకున్న నైపుణ్యత భవిష్యత్తులో మార్కెట్ లో ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచంతో పోటీపడి ఏఐ విద్య కూడా కళాశాలలో ఉండడంతో భవిష్యత్ తరాలకు కొత్త టెక్నాలజీని రూపొందించుకుంటున్నారన్నారు. విద్య అనేది ప్రతి మనిషిలో పరిపూర్ణత, సామాజిక బాధ్యతను తెలియపరుస్తుందన్నారు. ప్రపంచం రోజురోజుకీ నవీకరణ అవుతుండడంతో ప్రతి విద్యార్థి దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఇంటర్నెట్ ఉపయోగం ద్వారా విద్య నేర్చుకోవడం కాదు ఇంటర్నెట్ లోకి ఎలా మనం ఎలా వెళ్లాలి అన్నది టెక్నాలజీ ద్వారా విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లు ముందు మన గురించి మనం ఆలోచించి, తర్వాత ప్రపంచం గురించి, మనం ఏం చేస్తామన్న విధానాన్ని అశోక గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నేర్పిస్తుందని అన్నారు. ప్రపంచంలో ఇండియా నుంచి ఎదిగిన సుందర్ పిచాయ్, నారాయణమూర్తి గ్లోబల్ గొప్ప వ్యక్తులని, వారి నిబద్ధతోనే ఈ స్థాయికి వెళ్లారన్నారు. ప్రతి విద్యార్థికి నిబద్ధతతో కూడిన లక్ష్యం ఉండాలన్నారు. విద్యార్థులు తమ తెలివితేటలు, నిబద్ధతతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్పష్టం చేశారు. అంతకుముందు నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 8.3లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన క్యాంపు ప్లాన్ ను ఆవిష్కరించారు. మొత్తం 97మంది విద్యార్థులకు డిప్లమా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ప్రముఖ కంపెనీలు టెక్ మహీంద్రా, ఐబీఎం, హెచ్ డి ఎఫ్ సి, ఈవై, జెన్ పాక్ట్ మొదలైన కంపెనీలు ప్లేస్ మెంట్లు ఇచ్చాయి. సగటు ప్యాకేజీ రూ.6.5లక్షలు కాగా, గరిష్టంగా రూ.14.5లక్షలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరాన్ ఖాన్సుల్ జనరల్ మహ్దీ షరోఖీ, డిలైట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ శర్మ, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ వై లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మా జీతాలు మా అకౌంట్లోనే వేయాలి

**సిఐటియు జిల్లా కోశాధికారి జీలకర్ర పద్మ**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: స్కూల్స్ లో స్కావెంజర్స్ గా పనిచేస్తున్న కార్మికుల జీతాలు కార్మికుల అకౌంట్లోనే వేయాలనీ సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కావెంజర్స్ స్కూల్ లలో గత తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్నారనీ గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల నుండి జీతాలు నేరు గా వారి ఖాతాలోనే వేసే వారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి జీతాలను ఇప్పుడు అమ్మ ఆదర్శ కమిటీలు స్కూల్ హెచ్ఎంలు జాయింట్ అకౌంట్ లో వేస్తున్నారని కష్టపడి పనిచేస్తున్న కార్మికుల జీతాలు కార్మికుల అకౌంట్లో వేయకుండా అధికారుల ఎకౌంట్లో ఎందుకు వేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేము చెప్పిన పని చేయాలి ఇష్టం ఉంటే చేయండి లేకపోతే మానేయ్ మీ స్థానంలో ఇంకెవరినైనా పెడతామని అధికారులు కార్మికులను బెదిరింపులు గురి చేయటం సరైన కాదని అన్నారు. ఈరోజు స్కూల్లలో స్కా వెంజర్ పనులే కాకుండా అదనపు పనులు రిజిస్టర్లు ఇవ్వడం రికార్డులు అందించడం పేపర్లు అందించడం ఎగ్జామ్ టైం లో డ్యూటీలు వేయడం ఇలా అనేక పనులు చేయిస్తున్నారని. అదనపు పనులకు అదన వేతనం ఏమాత్రం చెల్లించడం లేదని అదనపు పనులకు అదనపు వేతనం ఇవ్వాలి అన్నారు. స్కావెంజర్స్ జీతాలను నేరుగా కార్మికుల ఎకౌంట్లోనే వేయాలని అధికారుల వేధింపులు ఆపాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని కనీస వేతనాలు అమలు చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఈఎస్ఐ, పిఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్కావేంజార్స్ నిహారిక, పద్మ, రూత్, కళ్యాణి, శ్రీదేవి , రహమ, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు

## ఆపద లో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అప్పన్న హస్తంలా అదుకుంటుంది

*** మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆపద లో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అప్పన్న హస్తంలా అదుకుంటుందని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ ప్రాంతానికి చెందిన కొండవిటి లక్ష్మీ నరసింహ ఆరోగ్య పరిస్థితిపై స్థానిక నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా వారి ఆర్థిక పరిస్థితి చలించిన ఎమ్మెల్యే మెరుగైన వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కొండవిటి లక్ష్మీ నరసింహకు రూ.3.00 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించగా శనివారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ లు లబ్ధిదారునికి ఎల్ఓసీ చెక్కును పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునే నాయకులు, కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మూడు లక్షల రూపాయలను మంజూరు చేయించడం పేద ప్రజల పట్ల వారికున్న ప్రేమను తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు అడప శేషు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





# కూకట్ పల్లి నల్లచెరువు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న హైడ్రా...

*** హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి**

*** నోటీసులు ఇవ్వకుండా భూమి స్వాధీనానికి హైడ్రాయత్నం...**

*** కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా సెలవు రోజుల్లో స్వాధీనానికి యత్నిస్తున్నారని రైతుల మండిపాటు...**

*** సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం నడుచుకుంటే భూమి ఇచ్చేందుకు సిద్ధమంటున్న రైతులు**

*** నష్టపరిహారం ఏ రూపంలో ఇస్తారో తేల్చాలనీ డిమాండ్**

*** నల్లచెరువు ఎఫ్టీఎల్ భూమిని పోలీసులతో కలిసి పరిశీలించి వెళ్లిన హైడ్రాధికారులు... రైతుల్లో గుబులు**

*** లేక్ ప్రొటెక్షన్ పేరిట పట్టా భూముల్ని నష్టపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నహైడ్రా**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నల్లచెరువు సమీపంలోని భూమిపై ఏళ్ల తరబడి వారసత్వ హక్కులు కలిగి ఉన్న రైతుల్లో హైడ్రా అధికారులు గుబులు రేపుతున్నారు. కూకట్పల్లి గ్రామ సర్వేనెంబర్ 27 నుంచి 80 వరకు ఉన్న పట్టా భూములు ఉన్నాయి. 7.38 ఎకరాల ప్రభుత్వ భూమిలో నల్లచెరువు వాటర్ బాడీ ఉండగా చుట్టుపక్కల భూమి మొత్తం యాజమాన్యం హక్కులు కలిగిన పట్టా భూములని రెవిన్యూ రికార్డులు చెబుతున్నాయి. ప్రభుత్వ భూమిలో విస్తరించి ఉన్న చెరువు పూడిక తీయడానికి ,అభివృద్ధి చేయడానికి గాని రైతులకు ఎలాంటి అభ్యంతరం లేదు. చెరువు చుట్టుపక్కల ఉన్న 22 ఎకరాల పట్టా భూమి అనాదిగా పూర్తి యాజమాన్య హక్కులతో రైతులు కూరగాయలు, పాడి పంటలతో జీవనం సాగిస్తూ వస్తున్నారు. ఒకనాడు పల్లె ప్రాంతంగా ఉన్న కూకట్పల్లి పట్టణీకరణలో భాగంగా కాంక్రీట్ జంగల్ గా మారడంతో నల్ల చెరువు చుట్టూ ఉన్న పట్టా భూములలో వ్యవసాయం కనుమరుగైంది. ఇప్పటివరకు ప్రభుత్వం చెరువుకు శాస్త్రీయ పద్ధతిలో చెరువు ఎఫ్టీల్ ఎంత అనేది పూర్తిస్థాయిలో నిర్ధారించక పోగా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ ఎఫ్ టి ఎల్ పరిధి అంటూ అధికారులు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ వస్తున్నారు. అయినా చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో వివిధ కాలనీలు ఏర్పడ్డాయి. నల్లచెరువు ఎఫ్ పి ఎల్ పరిధిలోని రైతులు పాడి కోసం గేదెల షెడ్లు పాకలు ఏర్పాటు చేసుకుంటూ పూల తోటలతో భూములను రైతులు కాపాడుకుంటూ వస్తున్నారు. చట్టబద్ధమైన హక్కులు కలిగి ఉన్న తమ భూములను చెరువు బ్యూటిఫికేషన్ పేరుతో 2017 లో ఒకసారి, ఎస్ టి పి ప్లాంట్ నిర్మాణం పేరుతో 2021లో వాటర్ బోర్డు, జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకునే యత్నాన్ని 2022లో బాధిత రైతులు రాష్ట్ర అత్యున్నత న్యాయవ్యవస్థను ఆశ్రయించి అడ్డుకున్నారు. అయినా ఆగకుండా అధికారులు మళ్ళీ ప్లాంట్ పనులు మొదలు పెట్టడంతో ఆధారాలతో సహా తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి వాటర్ బోర్డు ఎండి దానికిషోర్, జిల్లా కలెక్టర్ హరీష్ తాసిల్దార్ గోవర్ధన్ కు కోర్టు ఆదేశాల ధిక్కరణ కింద హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రైతులకు చెందిన పట్టా భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ నోటీసులు ఇవ్వకుండా తీసుకోమని సీలింగ్ భూమి, ప్రభుత్వ భూమి అనుకొని పొరపాటున తొలగించామని, కోర్ట్ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని అధికారులు లిఖితపూర్వకమైన సమాధానం కోర్టుకు ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇది గతం.

*** హైడ్రా అత్యుత్సాహం రైతుల్లో ఆందోళన**

2024 లో ఆవిర్భవించిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆవిర్భవించింది ఆలస్యం అన్నట్లుగా కూకట్పల్లి నల్లచెరువు పై దృష్టి సారించింది. అప్పటికే ఎన్నో నిర్మాణాలు ఎఫ్ టి ఎల్ పరిధిలో వెలిశాయని ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేతలకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై సర్వత్రా ఆందోళనలు, విమర్శలు వెల్లివెత్తిన నేపథ్యంలో కూల్చివేతలను తాత్కాలికంగా హైడ్రా వాయిదా వేసింది. అయితే గత ప్రభుత్వ హయాంలోనే ఎస్టిపి ప్లాంట్, చెరువు బ్యూటిఫికేషన్ పేరుతో భూముల్లో



తిష్ట వేయడానికి అధికారులు చేసిన యత్నాన్ని హైకోర్టు ద్వారా ఆడుకున్న రైతులు హైడ్ర అధికారులను కలిసి తమ వద్దనున్న ఆధారాలను సమర్పించారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను , కోర్టు ఆదేశాల ధిక్కరణ పిటిషన్ కొనసాగుతున్న విషయాన్ని ఆధారాలతో సహా అందజేశారు . ఇప్పటివరకు ఏ ప్రభుత్వం శాస్త్రీయ బద్దంగా సర్వే నిర్వహించి ఎఫ్ టి ఎల్ హద్దులు బఫర్ జోన్ నిర్ధారించలేదని హైడ్రా ఆధ్వర్యంలో త్వరితగతిన ఎఫ్టిఎల్ ,బఫర్ జోన్ హద్దులు నిర్ణయించి వెల్లడిస్తే తమ భూములను స్వచ్ఛందంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని కలిసి విన్నవించినట్లు రైతులు తెలిపారు. ఒకరి ఆధీనంలో ఉన్న భూమిని , యాజమాన్యపు హక్కులు కలిగిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలంటే నోటీసులు ఇవ్వడంతో పాటు సరైన సమయం ఏ విధమైన పరిహారం ఇస్తారో నోటీసుల్లో చెప్పాలన్న సుప్రీంకోర్టు గైడ్లైన్స్, నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. దీనికి హైడ్రా కమిషనర్ కూడా సానుకూలంగా స్పందించి త్వరలోనే నోటీసులు జారీ చేయడంతో పాటు నష్టపరిహారం డబ్బు రూపంలో గానీ, టిడిఆర్ రూపంలో గానీ ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామని తమకు హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు చెప్పారు. అయితే తమకు తాజాగా లేక్ ప్రొటెక్షన్ పేరుతో తాము భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు తూతూ మంత్రంగా హెచ్చరిక లాంటి నోటీసులు జారీ చేశారే కానీ, పూర్తి యాజమాన్య హక్కులు కలిగిన పట్టా భూమికి నష్టపరిహారం ఇచ్చే విషయాన్ని స్పష్టంగా పేర్కొనకుండా హడావుడిగా ఇచ్చి జెసిపిలను ఇటాచ్లను రంగంలోకి దించడంపై బాధిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శాస్త్రీయ బద్ధమైన సర్వే లేకుండా లేక్ ప్రొటెక్షన్ కొరకు ఎక్కడో ఉన్న తమ భూములను ఎలా ఇవ్వగలమని ప్రశ్నించారు.

*** మూడు రోజులువరుస సెలవులు కూల్చివేతకు హైడ్రా యత్నిస్తుందని రైతుల ఆందోళన**

మూడు రోజుల వరుస సెలవుల నేపథ్యంలో శుక్రవారం పోలీసులతో సహా హైడ్రాధికారులు భూములను పరిశీలించి వెళ్లడంపై బాధిత రైతుల్లో గుబులు రేపుతుంది. గతంలో మాదిరి ఎలాంటి సమాచారం లేకుండా తెల్లవారుజామునే విరుచుకుపడి నిర్మాణాలను కూలగొట్టినట్లుగా ఎక్కడ తమ భూమిని స్వాధీనం చేసుకుంటారో అని తమకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తమ అడ్వకేట్ల సమక్షంలో హైడ్రా కమిషనర్ ను కలిసిన సమయంలో చాలా సానుకూలంగా స్పందించి నోటీసులు ఇచ్చి నష్టపరిహారం సంగతి తేల్చిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకుంటామని చెప్పిన అధికారులు ఇప్పుడు ఇలా అత్యుత్సాహం ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమ భూమి ఎఫ్టిఎల్ పరిధిలో ఉన్నట్లు నిరూపిస్తే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినప్పటికీ సుప్రీంకోర్టు ఆదేశాలను గైడ్ లైన్స్ ను, తాజాగా హైకోర్టు ఇచ్చిన నాట్ టు ఇంటర్ ఫియర్ ఇంజక్షన్ ఉత్తర్వులను పట్టించుకోకుండా మూడు రోజుల వరుస సెలవులను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రజాస్వామికంగా, నియంతృత్వంగా స్వాధీనం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని నల్లచెరువు బాధిత రైతులు వేడుకుంటున్నారు.

# హైదరాబాద్ కొంపల్లిలో అతిపెద్ద మోటర్ సైకిల్స్ డీలర్‌షిప్ ప్రారంభించిన జావా, యెజ్డి, బిఎస్ఎ

హైదరాబాద్ 12 ఏప్రిల్ (ప్రజాస్ఫూర్తి): భారతదేశంలోని ఉత్సాహపూరితమైన మోటర్‌సైకిల్ బ్రాండ్ అయిన జావా యెజ్డి మోటర్‌సైకిల్స్, ఈరోజు హైదరాబాద్‌లో తమ అతిపెద్ద డీలర్‌షిప్‌ను కొంపల్లిలో ఘనంగా ప్రారంభించింది. కొంపల్లి లో ఏర్పాటు చేసిన ఈ సౌకర్యం, మోటర్‌సైక్లింగ్ ప్రేమికులకు విస్తృత శ్రేణి మోటర్‌సైకిళ్లు, ప్రీమియం సేవల అనుభవం, అసమానమైన కస్టమర్ అనుభవాన్ని అందిస్తుంది. కంపెనీ ఇప్పుడు హైదరాబాద్‌లో తమ 7వ డీలర్‌షిప్ రివెక్స్‌పీరియన్స్ మోటో ను క్లాసిక్ లెజెండ్స్ కుటుంబంలోకి స్వాగతించింది. ఈ కొత్త డీలర్‌షిప్ బ్రాండ్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది, ఇది జావా మరియు యెజ్డి వంటి క్లాసిక్ బ్రాండ్‌ల వాసులు నుంచి అందుకున్న ప్రేమ మరియు ప్రతిస్పందనను ప్రతిబింబిస్తుంది. ఈ డీలర్‌షిప్ జావా, యెజ్డి మరియు బిఎస్ఎ మోటర్‌సైకిల్స్ యొక్క పూర్తి శ్రేణిని ప్రదర్శిస్తుంది. అమ్మకాలు మరియు అమ్మకాల తర్వాత సేవలతో సహా వాహనాలకు సంబంధించిన సేవలను అందిస్తుంది. క్లాసిక్ లెజెండ్స్ సీఓ చరణ్ అగర్వాల్ తన



సంతోషాన్ని పంచుకుంటూ , "హైదరాబాద్ మాకు ప్రాముఖ్యత కలిగిన నగరం. క్లాసిక్ మోటర్ సైకిళ్ల పట్ల ఈ నగరవాసులు చూపుతున్న ప్రేమ అపూర్వం . రివెక్స్‌పీరియన్స్ మోటోను మా కుటుంబంలోకి స్వాగతించడానికి మేము సంతోషిస్తున్నాము. ఈ కొత్త డీలర్‌షిప్ అత్యుత్తమ మోటర్‌సైక్లింగ్ అనుభవాలను అందించడంలో, జావా, యెజ్డి మరియు బిఎస్ఏ మోటర్‌సైకిళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో మా నిబద్ధతకు నిదర్శనం" అని అన్నారు

## రాష్ట్ర పథకాలలో అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం వాటా

* బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ వినోద్ నాయక్



బొమ్మలరామారం , ప్రజాస్ఫూర్తి : బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ వినోద్ నాయక్ అధ్వర్యంలో చౌదరిపల్లి గ్రామంలో కార్యక్రమం ఇంచార్జ్ కధూరి ఆచ్చయ్య, జిల్లా ఇంచార్జి సుర్వి శ్రీనివాస్ గౌడ్ లు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం పాల్గొన్న అనంతరం మండల అధ్యక్షుడు మాలోత్ వినోద్ నాయక్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలను కలసి వారి సమస్యలు తెలుసుకుని కేంద్ర ప్రభుత్వం పథకాలు లేబర్ ఇన్సూరెన్స్, పిఎం కిసాన్, రేషన్ బియ్యం లో కేంద్ర ప్రభుత్వం వాటా ఎఫ్ సి ఐ మద్దతు ధరకు వడ్ల కొనుగోలు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం నిధులు వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా రామాలయం, శివాలయం, మరియూ హాస్పిటల్ ప్రభుత్వ పాఠశాల లూ పరిశుభ్రం చేయడం జరిగింది ,ఈ కార్యక్రమంలో మండల కన్వినార్ రవిశంకర్, కోకన్వీనర్ బాలరాజు,,ఓబీసీ మోర్చా మహేష్ గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఆనంద్ గౌడ్,రామా గౌడ్,రవీందర్ రెడ్డి, నర్సింహా గౌడ్ ,సాయి కుమార్ , గుండ్ల గోపాల్,భాస్కర్,గోపాల్, బాల్ రెడ్డి,రాజు, ఎల్లా గౌడ్,వెంకటేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## డిస్కంలకు టారిఫ్ సబ్సిడీ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతి

అమరావతి: ఏపీలోని డిస్కంలకు టారిఫ్ సబ్సిడీ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూడు ప్రాంతాల్లోని విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.4,470 కోట్లు విడుదల చేసింది. వినియోగదారులకు బదలాయిస్తున్న టారిఫ్ సబ్సిడీ భరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 202526 ఏడాది తొలి త్రైమాసికానికి నిధుల విడుదలకు పాలనా అనుమతి లభించింది. ప్రజలపై టారిఫ్‌ల భారం పడకుండా సబ్సిడీ మొత్తం బదలాయిస్తూ ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. డిస్కం ఖాతాల్లో మొత్తం జమ చేయాలని పవర్ కోఆర్డినే షన్ కమిటీని ఆదేశించింది.



## నెల్లూరు జిల్లాలో లీకైన అమ్మోనియా.. పరుగులు తీసిన కార్మికులు

టీపీగూడూరు: నెల్లూరు జిల్లాలోని టీపీ గూడూరు మండలం అనంతపురం గ్రామంలో అమ్మోనియా లీక్ ఘటన కలకలం సృష్టించింది. వాటర్‌బేస్ కంపెనీలో అమ్మోనియా గ్యాస్ లీక్‌తో కార్మికులు పరుగులు తీశారు. ఈ ఘటనలో 10 మంది కార్మికులు అస్వ స్థతకు గురికాగా.. నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. చుట్టుపక్కల గ్రామాలకు సైతం అమ్మోనియా గ్యాస్ వ్యాపించింది. స్థానికులు భయాందోళనకు గుర య్యారు. ముందు జాగ్రత్తగా మాస్కులు ధరించారు.

*** అందరూ క్షేమం: నెల్లూరు ఆర్డీవో**

టీపీ గూడూరులో అమ్మోనియా లీకేజీపై నెల్లూరు ఆర్డీవో వివరణ ఇచ్చారు. నీటి ఆధారిత గ్యాస్ కంపెనీలో అమ్మోనియా లీకేజీ అయ్యిందన్నారు. గ్యాస్ లీక్ కాగానే అలారం మోగిందని, వెంటనే సిబ్బంది భయంతో పరుగులు తీశారని అన్నారు. బయటకు వచ్చే సమయంలో కిందపడి కొందరికి గాయాలైనట్లు చెప్పారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని, అందరూ క్షేమంగా ఉన్నారని అన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ బైక్‌ను ఏ వాహనమూ ఢీకొనలేదు.. కీలక విషయాలు వెల్లడించిన ఐజీ

రాజమహేంద్రవరం: పాస్టర్ ప్రవీణ్ మృతిపై వివిధ రకాలుగా దర్యాప్తు చేపట్టినట్లు ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రాజ మహేంద్రవరంలో ఆయన వివరాలు వెల్లడించారు. ''ప్రవీణ్ దారిలో వెళ్తుండగా పలువురితో మాట్లాడారు. పలువురు సాక్షు లను ప్రశ్నించి సమాచారం రాబట్టాం. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించాం. ప్రవీణ్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయలేదు. సోషల్ మీడియాలో మాట్లాడిన వారు ఎలాంటి ఆధారాలూ ఇవ్వలేదు. పోలీసుల దర్యాప్తుపై నమ్మకం ఉందని ప్రవీణ్ కుటుంబసభ్యులు చెప్పారు. సోషల్ మీడియాలో చెప్పినవన్నీ నిరాధార ఆరోపణలే. ఆయన హైదరాబాద్, కోదాడ, ఏలూరులో మద్యం దుకాణాలకు వెళ్లారు. దారిలో ఆయనకు 3 సార్లు చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయి.

**ప్రవీణ్ శరీరంలో మద్యం ఆనవాళ్లు**

ప్రవీణ్ దారిలో ఆరుసార్లు యూపీఐ పేమెంట్లు



చేశారు. ఆయన శరీరంలో మద్యం ఆనవాళ్లు ఉన్నాయని ఎఫ్ఎస్ఎల్ నివేదిక చెప్పింది. కీసర టోల్‌ప్లాజా వద్ద ఆయన అదుపుతప్పి కింద పడిపోయారు. సాయం చేసేందుకు అంబులెన్స్, వైద్య సిబ్బంది వెళ్లారు. రామవరప్పాడు జంక్షన్ వద్ద ప్రవీణ్ పరిస్థితిని ఆటో డ్రైవర్ చూశారు. ట్రాఫిక్ ఎస్సై సూచనతో పార్కులో రెండు గంటలు నిద్రపోయారు. కండిషన్ బాగోలేదు, వెళ్లవద్దని చెప్పినా ఆయన వినలేదు. హెడ్‌లైట్ పగిలిపోవడంతో రైట్ సైడ్ బ్లింకర్ వేసుకునే ప్రయాణించారు.ఏలూరులో ఆయన మద్యం కొనుగోలు చేశారు. మద్యం దుకాణానికి వచ్చినప్పటికే ప్రవీణ్ కళ్లజోడు పగిలిపోయి ఉంది. కొంతమూరు పైవంతెనపై కూడా ఆయన వేగంగా వెళ్లారు. ప్రమాదం జరిగిన స్థలంలో బుల్లెట్ వాహనం రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ఆయన బుల్లెట్‌ను ఏ వాహనం కూడా ఢీకొనలేదు. బైక్‌కు, పక్కన వెళ్తున్న కారుకు చాలా గ్యాప్ ఉంది. ప్రమాద స్థలంలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. కంకర రాళ్లు ఉన్నాయి. బుల్లెట్ పైకి ఎగిరి పాస్టర్ ప్రవీణ్‌పై పడిందని ఫోరెన్సిక్ నివేదిక చెప్పింది. ప్రమాదం జరిగినప్పుడు బండి ఫోర్త్‌గేర్‌లో ఉంది. ఇతర వాహనాలను ఢీకొనలేదని ఫోరెన్సిక్ నిపుణులు స్పష్టం చేశారు'' అని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు.

## చైనాలో భీకర గాలులు.. 600 పైగా విమాన సర్వీసులు రద్దు

బీజింగ్: భీకర గాలులు చైనాను వణికిస్తున్నాయి. ఇసుక తుపాను బీభత్సం సృష్టిస్తోంది. భారీ గాలులతో రాజధాని బీజింగ్‌లో చెట్లు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్త మైంది. దాదాపు 693 విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో బీజింగ్, డాక్సింగ్‌లో మధ్యాహ్నం వరకు వందలాది విమాన, రైల్వే సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. అధికారులు పార్కులు తాత్కాలికంగా మూసేశారు. దేశంలోని కొన్ని ప్రాం తాల్లో.. 75 ఏళ్లలో ఎన్నడూ లేని శక్తివంత మైన గాలులు వీచినట్లు కథనాలు పేర్కొ న్నాయి. ముఖ్యంగా దేశ ఉత్తర, తీర ప్రాంతాల్లో ప్రమాదకర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నట్లు నిపుణులు హెచ్చరించారు. ఈ



గాలుల ప్రభావంతో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, ఇతర ముఖ్య కార్య క్రమాలకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే దేశ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లకూడదని.. జాగ్రత్తగా ఉండాలని కోరింది.

## వనజీవి రామయ్య సలహాను పాటించాం: నాగబాబు

*** వనజీవి రామయ్య మృతి కలచివేసిందన్న నాగబాబు**

*** ఆయన సలహాతో 10 వేలకు పైగా మొక్కలు నాటామని వెల్లడి**

*** రామయ్య ఒక రియల్ హీరో అని ప్రశంస**

వనజీవి రామయ్య మృతి పట్ల జనసేన ఎమ్మెల్సీ నాగబాబు విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తనను కలచివేసిందని అన్నారు. గతంలో హైదరాబాద్ లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామయ్యను సన్మానించడం జరిగిందని తెలిపారు. అప్పటికే మొక్కలు నాటే కార్యక్రమంలో తనకు అవగాహన ఉందని... ఆయన సలహాతో జీడిమెట్లలోని ప్రభుత్వ భూమిలో 10 వేలకు పైగా మొక్కలు నాటామని చెప్పారు. రామయ్య చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ తాము కొంత ఆర్థిక సాయం కూడా చేశామని నాగబాబు తెలిపారు. రామయ్య ఒక రియల్ హీరో అని... ఆయనకు పద్మశ్రీ దక్కడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ప్రకృతి పట్ల ఆయనకున్న అంకితభావం, నిబద్ధత చాలా గొప్పదని కొనియాడారు. ఆయన నాటిన మొక్కల ద్వారా ఎంతో మంది సేద తీరుతున్నారని



చెప్పారు. ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాలని పిలుపునిచ్చారు. రామయ్య మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నానని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

## ముస్లింల ఓటు బ్యాంకు కోసం దుష్ప్రచారం చేస్తున్నారు

*** అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారని మోదీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారన్న పురందేశ్వరి**

*** కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగానికి ఎక్కువ సార్లు సవరణలు జరిగాయని విమర్శ**

*** అంబేద్కర్ ను గతంలో కాంగ్రెస్ అవమానించిందని మండిపాటు**

ముస్లింల ఓటు బ్యాంకు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఏపీ బీజేపీ చీఫ్



పురందేశ్వరి మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారంటూ మోదీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగానికి ఎక్కువ సార్లు సవరణలు జరిగాయని తెలిపారు. బీజేపీ హయాంలో 22 సార్లు సవరణలు చేశారని... ఇవన్నీ వివిధ వర్గాల అభ్యున్నతికి దోహదం చేసేవని చెప్పారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఈరోజు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న బూత్ లెవెల్ లో పలు కార్యాక్రమాలను చేపడుతున్నామని పురందేశ్వరి వెల్లడించారు. అంబేద్కర్ కు సరైన గౌరవం ఇచ్చింది బీజేపీనే అని చెప్పారు. అంబేద్కర్ ను గతంలో అవమానించి ఆయన రాజీనామా చేసేలా చేసిన చరిత్ర ఎవరిదో అందరికీ తెలుసని అన్నారు. అంబేద్కర్ నివాసాన్ని అభివృద్ధి చేసింది కూడా బీజేపీనే అని చెప్పారు. భారత రాజ్యాంగం వల్లే బీసీ అయిన తాను ప్రధాని అయ్యానని మోదీ చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఇలాంటి అంశాలపై పరిజ్ఞానం పెంచుకుని ప్రజలకు వివరించాలని సూచించారు.

# ట్రంప్ కీలక నిర్ణయం..

స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్‌లకు సుంకాల నుంచి మినహాయింపు..!



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పలు ఎలక్ట్రానిక్స్ వస్తువులను సుంకం నుంచి మినహాయించనున్నట్లు ట్రంప్ పరిపాలన ప్రకటించింది. స్మార్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్, చిప్స్‌కు మినహాయింపు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం సాధారణ వినియోగదారులకు సైతం ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నది. ట్రంప్ పరిపాలన సుంకాలను యథావిధిగా అమలు చేస్తే ఆయా వస్తువల ధరలను పెరిగే అవకాశం ఉండేది. ప్రస్తుతం అవే ధరలు కొనసాగే అవకాశం ఉన్నది. యుఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. అనేక వస్తువలకు సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చింది.

ఇందులో ప్రధానంగా స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ మిషన్స్, ఫ్లాట్ ప్యానెల్ మానిటర్స్‌తో పాటు పలు వస్తువులకు మినహాయింపు ఇచ్చింది. ఈ నిర్ణయంతో ఆపిల్, శామ్‌సంగ్ వంటి బడా టెక్ కంపెనీలకు ఎంతో ఊరట కలుగనున్నది. ఎందుకు కంటే ఆయా కంపెనీల ఉత్పత్తులు చాలా వరకు అమెరికాలో తయారయ్యే అవకాశం లేదు. ఇతర దేశాల నుంచి మాత్రమే ఆయా కంపెనీలు దిగుమతి చేసుకుంటాయి. ఆయా ఉత్పత్తులకు అమెరికాలో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. కానీ, అవి ఎక్కువ చైనా, కొరియా, వియత్నాం తదితర దేశాల్లో ఉత్పత్తి అవుతుంటాయి. వాటిపై భారీ పన్నులు విధించినట్లయితే, కంపెనీలు నష్టపోయే అవకాశం ఉండడంతో పాటు వినియోగదారులపై సైతం అదనపు భారం పడే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ట్రంప్ సర్కారు వాటిని సుంకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించింది.

## రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర..

నయా ట్రెండ్ మొదలైందిగా..!



**న్యూఢిల్లీ:** అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతున్నది. ఈ క్రమంలో బంగారం ధరలు పతనమయ్యాయి. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో 3200 డాలర్లకు చేరింది. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపై సైతం కనిపిస్తున్నది. ముంబయిలో 24 క్యారెట్ల బంగారం శనివారం మధ్యాహ్నం వరకు పది గ్రాములకు రూ.96,600కి చేరగా.. 22 క్యారెట్స్ గోల్డ్ రూ.87,460 వద్ద కొనసాగింది. శుక్రవారంతో పోలిస్తే బంగారం ధర రూ.2వేల వరకు పెరిగిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. బంగారం రికార్డు స్థాయి ధర రూ.లక్ష మార్క్‌ని చేరుకునేందుకు కేవలం రూ.4,500 దూరంలో ఉన్నది. ఈ క్రమంలో జవేరి బజార్‌లో రీసైకిల్ చేసిన బంగారం అమ్మకాలు, కొనుగోళ్లు పెరిగాయి. బాంబే బులియన్ అసోసియేషన్ సభ్యుడు, ఆభరణాల వ్యాపారి సంజయ్ కొఠారి మాట్లాడుతూ బంగారం ధర రికార్డు స్థాయిలో ఉందన్నారు.

దాంతో ప్రస్తుతానికి ఆభరణాల కొనుగోళ్లు జరగడం లేదని చెప్పారు. పెళ్లిళ్ల సీజన్ కారణంగా 80శాతం మంది వినియోగదారులు రీసైకిల్ చేసిన బంగారాన్ని అంటే.. పాత ఆభరణాలను కొత్తగా తయారు చేయించుకుంటున్నారని చెప్పారు. పాత బంగారాన్ని అమ్మి దాని స్థానంలో కొత్త ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కస్టమర్లు బంగారు నాణేలు, గతంలో కొనుగోలు చేసిన బంగారాన్ని విక్రయిస్తూ ఆభరణాలుగా మార్చుకుంటున్నారన్నారు. ఇంత ఎక్కువ ధరలు ఉన్నా.. 5శాతం వరకు కొత్త కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఇందులో అధిక ఆదాయవర్గం మాత్రమే షాపింగ్ చేస్తున్నట్లుగా కనిపిస్తుందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. వెండితో చేసిన చిన్న వస్తువులను కొనుగోలు చేస్తున్నారని.. ఇందులో బహుమతులుగా ఇచ్చే కాళ్ల పట్టీలు, తేలికపాటిక వస్తువులకు 10శాతం వరకు డిమాండ్ ఉంటుందని చెప్పారు.

బాంబే బులియన్ అసోసియేషన్ జాతీయ ప్రతినిధి కుమార్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి, వినియోగదారులు బంగారం కొనడానికి ముందు కొంచెం ఓపికపట్టాలని.. పెట్టుబడి పెట్టాలనుకుంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడి పెట్టాలన్నారు. ఎందుకంటే బంగారం ఖరీదైందని.. ప్రస్తుతం దాన్ని భౌతికంగా కాకుండా ప్రణాళికాబద్ధంగా కొనుగోలు చేయాలని చెప్పారు. అమెరికా -చైనా మధ్య పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తత, సుంకాల ఆందోళనల కారణంగా ఇటీవల కొద్దిరోజులు ధరలు పతనమయ్యాయి. కానీ, తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధర రికార్డు స్థాయిలో 3200 డాలర్లకు చేరింది. రాబోయే రోజుల్లోనూ పసిడి, వెండి ధరలు సైతం పెరగడం ఖాయమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నారు. అనిశ్చితి వాతావరణంలో భౌతికంగా బంగారం కొనుగోలు చేయకుండా.. సురక్షితమైన పెట్టుబడుల్లో ఒకటైన గోల్డ్ ఈటీఎఫ్ ద్వారా పెట్టుబడులను ఎంచుకోవచ్చని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## యూపీఐ సేవల్లో మళ్లీ అంతరాయం..

సోషల్ మీడియా ద్వారా అసహనం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ సేవల్లో మరోసారి అంతరాయం ఏర్పడింది. యూపీఐ సర్వర్ డౌన్ కావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూపీఐ ద్వారా జరిగే ఆన్‌లైన్ సేవలు దాదాపు గంట నుంచి నిలిచిపోయాయి.

డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఇవాళ ఉదయం 11:26 గంటల ప్రాంతంలో యూపీఐ సేవల్లో సమస్య తలెత్తింది. 11:45 గంటల సమయానికి అది మరింత తీవ్రమైంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి సేవలు పనిచేయడం లేదు. ఈ సమస్యపై వినియోగదారులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. నెట్‌వర్క్ స్లో అని, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం కూడా సాధ్యం కావట్లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల్లో సమస్యల గురించి 222 కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. దీంతో యూపీఐపై ఆధారపడిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అంశంపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇంకా స్పందించలేదు. కాగా, మూడు వారాల్లో ఇలా యూపీఐలో సమస్యలు తలెత్తడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

# అభిషేక్ విధ్వంసక సెంచరీ..

పంజాబ్‌పై సన్‌రైజర్స్ రికార్డు విజయం



**హైదరాబాద్:** సన్‌రైజర్స్ ఆటగాళ్లు రెచ్చిపోతే కొండంత లక్ష్యమైనా కరగాల్సిందే. గత సీజన్‌లో రికార్డు స్కోర్‌తో చరిత్ర సృష్టించిన ఆరెంజ్ ఆర్మీ.. తమకు తామే సాటి అని చాటుతూ ఉప్పల్ స్టేడియంలో 245 పరుగుల టార్గెట్‌ను ఊది పడేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(100) పంజాబ్ కింగ్స్ బౌలర్లను ఊచకోత కోస్తూ వీరోచిత శతకం సాధించాడు. ఉప్పల్ స్టేడియం నలువైపులా బౌండరీలతో అలరించిన అభిషేక్ ట్రావిస్ హెడ్(66)తో తొలి వికెట్‌కు 171 రన్స్ జోడించి పంజాబ్ ఆశలపై నీళ్లు హెడ్ ఔటయ్యాక హెన్రిచ్ క్లాసెన్(21 నాటౌట్)తోడుగా హైదరాబాద్‌ను గెలుపు దిశగా నడిపించిన అభిషేక్.. విజయానికి 24 పరుగుల దూరంలో ఔటయ్యాడు. అయితే.. ఇషాన్ కిషన్(9 నాటౌట్) జతగా క్లాసెన్ లాంఛనం ముగించారు. దాంతో, కమిన్స్ సేన రికార్డు ఛేదనతో ఈ ఎడిషన్‌లో రెండో విజయం ఖాతాలో వేసుకుంది.

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఎట్టకేలకు సన్‌రైజర్స్ ఓపెనర్లు ఫామ్‌లోకి వచ్చారు. తాము ఆడితో ఎలా ఉంటదో చూపించారు. 17వ సీజన్‌లో పవర్ ప్లేలోనే 120 కొట్టిన ఓపెనర్లు అభిషేక్ శర్మ(141), ట్రావిస్ హెడ్(66)లు రికార్డు ఛేదనలో పోటాపోటీగా ఆడారు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన తొలి ఓవర్లో ట్రావిస్ హెడ్(30) రెండు బౌండరీలు బాదాడు. యాన్సెస్ బౌలింగ్‌లో బ్యాట్ ఝులిపించిన అభిషేక్ శర్మ(56) 4 ఫోర్లు సంధించి 16 రన్స్ పిండుకున్నాడు. అనంతరం అర్ష్‌దీప్‌కి చుక్కలు చూపిస్తూ హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు హెడ్. దాంతో 3 ఓవర్లకే సన్‌రైజర్స్ స్కోర్ 40కి చేరింది. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన యశ్ ఠాకూర్ ఓవర్లో అభిషేక్ సిక్సర్ బాదగా స్కోర్ 50 దాటింది. కానీ, ఆ తర్వాత బంతికే బౌండరీ వద్ద శశాంక్ సింగ్ క్యాచ్ అందుకున్నా అది నో బాల్ కావడంతో ఆరెంజ్ ఆర్మీ సంబురాలు చేసుకుంది.

నో బాల్‌తో లైఫ్ లభించడంతో అభిషేక్ సుడిగాలిలా విరుచుకుపడ్డాడు. లెగ్ సైడ్, ఫైన్ లెగ్, లాంగాఫ్.. బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. హెడ్‌ను చాహల్ ఔట్ చేయడంతో ఊపిరి పీల్చుకున్న పంజాబ్‌కు మళ్లీ గుండెదడ పెంచాడు అభిషేక్. 171 వద్ద వికెట్ పడినా వరుసపెట్టి బౌండరీలతో చెలరేగాడీ ఈ లెఫ్ట్ హ్యాండర్. హిట్టింగ్ డోస్ పెంచిన అతడు చాహల్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన అభిషేక్ ఐపీఎల్‌లో తొలి సెంచరీ సాధించాడు.

ఫిఫ్టీకి 19బంతులు తీసుకున్న అతడు మరో 21 బంతుల్లోనే శతకం సాధించాడు. 11 ఫోర్లు, 6 సిక్సర్లతో ఐపీఎల్‌లో తొలి వంద పూర్తి చేసుకున్నాడు అభిషేక్ 15వ ఓవర్లో 6, 4, 6 బాది జట్టు స్కోర్ 200కి చేరింది. ఆ తర్వాత యశ్ ఠాకూర్‌కు సిక్సర్‌తో స్వాగతం పలికిన ఈ చిచ్చరపిడుగు.. లెగ్ సైడ్ ఫోర్‌తో లక్ష్యాన్ని సులభం చేశాడు. జట్టు విజయానికి 24 పరుగులు అసవరం అనగా.. అభిషేక్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్(9 నాటౌట్), క్లాసెన్(21 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. యశ్ ఠాకూర్ వేసిన 19వ ఓవర్ మూడో బంతిని బౌండరీకి తరలించిన క్లాసెన్ జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు.

### అయ్యర్, స్టోయినిస్ దంచేయగా..

ఉప్పల్ స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ పరుగుల వరద పారింది. ఫ్లాట్ పిచ్ మీద పంజాబ్ కింగ్స్ టాపార్డర్ బ్యాటర్లు వీరవిహారం చేశారు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(42), ప్రియాన్ష్ ఆర్య(36)లు శుభారంభం ఇవ్వగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(82) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఫోర్లు, సిక్సర్లతో హోరెత్తించిన అయ్యర్ అర్ధ శతకంతో చెలరేగాడు. జట్టు స్కోర్ 200 దాటించి ఆరెంజ్ ఆర్మీని భయపెట్టాడు. అయితే.. హర్షల్ పటేల్(4-42) సంచనల బౌలింగ్‌తో కీలక వికెట్లు తీసి బ్రేకిచ్చాడు. అయితే. మార్కస్ స్టోయినిస్ 20వ ఓవర్లో ఏకంగా నాలుగు సిక్సర్లు బాదడంతో పంజాబ్ నిర్ణీత ఓవర్లో 6 వికెట్ల నష్టానికి 245 రన్స్ కొట్టింది.

# పాకిస్తాన్ సూపర్ లీగ్..

క్రికెటర్లు బస చేసిన హెటల్‌లో అగ్ని ప్రమాదం..!



**కరాచీ:** పాకిస్తాన్ సూపర్ లీగ్ శుక్రవారం మొదలైంది. అయితే, టోర్నీ ప్రారంభానికి ముందు ఇస్లామాబాద్‌లోని హెటల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఇక్కడ పీఎస్ఎల్ జట్టు క్రికెటర్లతో పాటు సిబ్బంది ఈ హెటల్‌లోనే బస చేశారు. ఇస్లామాబాద్‌లోని సెరెనా హెటల్‌లోని ఆరవ అంతస్తులో మంటలు చెలరేగాయని స్థానిక అధికారులు మీడియాకు తెలిపారు. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. పీఎస్ఎల్ క్రికెటర్లు, సిబ్బందిని రక్షించారు. మంటల్లో ఎవరూ గాయపడలేదని.. వారిని అక్కడి నుండి మరో చోటుకి తరలించినట్లు పేర్కొన్నారు. సకాలంలో మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. పీఎస్ఎల్ సీఈవో సల్మాన్ నసీర్ మీడియాతో మాట్లాడుతూ మంటలు హెటల్‌లోకి ప్రవేశించలేదన్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. ఆరు ఫైర్ ఇంజిన్లు, 50 మంది సిబ్బంది వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అరగంటలోనే పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు సీడీఏ అత్యవసర డైరెక్టర్ జాఫర్ ఇక్బాల్ పేర్కొన్నారు.

పీఎస్ఎల్ 2025 తొలి మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్.. లాహెర్ ఖలందర్స్‌తో రావల్పిండి క్రికెట్ స్టేడియంలో తలపడింది. ఐపీఎల్ నేపథ్యంలో పీఎస్ఎల్ తొలి మ్యాచ్‌ను గంట ఆలస్యంగా ప్రారంభించింది. ఐపీఎల్ నేపథ్యంలో రాత్రి 8 గంటలకు పీఎస్ఎల్ మ్యాచులు మొదలవుతాయని పీఎస్ఎల్ సీఈవో సల్మాన్ నసీర్ ఓ పాడ్‌కాస్ట్‌లో తెలిపారు. ఐపీఎల్, పీఎస్ఎల్ లీగ్‌లు మొదలైనప్పటి నుంచి.. ఒకే విండోలో తలపడడం ఇదే తొలిసారి. బిజీ క్యాలెండర్ నేపథ్యంలో ఏప్రిల్-మే విండోలో పీఎస్ఎల్‌ని షెడ్యూల్ చేయడం తప్ప మరో మార్గం లేదని నసీర్ పేర్కొన్నారు. ఇది మంచిది కాదని.. అయితే, పీఎస్ఎల్ అభిమానులను ఆకర్షిస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఐపీఎల్, పీఎస్ఎల్ ఒకేసమయంలో కొనసాగుతుండడం వల్ల ప్రయోజనం ఏంటంటే.. ఐపీఎల్ వేలంలో అమ్ముడవకుండా మిగిలిపోయిన కొందరు విదేశీ స్టార్స్ పీఎస్ఎల్ ఆడేందుకు ఒప్పందం చేసుకున్నారు. వచ్చే ఏడాది లీగ్‌లోకి మరో రెండు జట్ల చేర్చాలని భావిస్తున్నట్లు పీఎస్ఎల్ సీఈవో పేర్కొన్నారు.

# దుమ్మురేపిన అల్కరాజ్



మాంటే కార్లో మాస్టర్స్ సెమీస్ బెర్తు ఖరారు

**మొనాకో:** మొనాకో వేదికగా జరుగుతున్న మాంటే కార్లో మాస్టర్స్ 1000 టోర్నమెంట్‌లో కార్లోస్ అల్కరాజ్ దుమ్మురేపుతున్నాడు. టాప్ గేర్‌లో ఆడుతున్న ఈ యువకెరటం అలవోకగా పురుషుల సింగిల్స్ సెమీస్ ఫైనల్లో అడుగుపెట్టాడు. శుక్రవారం క్లే కోర్టులో జరిగిన క్వార్టర్స్‌లో అల్కరాజ్ ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ ఫిల్స్‌ను చిత్తుగా ఓడించాడు.

తొలి సెట్ కోల్పోయినా.. ఆ తర్వాత పుంజుకొన్న ఈ టాప్ సీడ్ ప్లేయర్ 4-6, 7-5, 6-3తో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. ఆరంభంలో వెనకబడినా.. ఆత్మవిశ్వాంసతో ఆడి మ్యాచ్ సొంతం చేసుకోవడం గర్వంగా ఉందని చెప్పాడీ స్పెయిన్ కుర్రాడు. సెమీస్‌లో తమ దేశానికే చెందిన అతడు అలెజంద్రో డేవిడొవిచ్‌తో తలపడనున్నాడు.

'నేను ఆత్మవిశ్వాసంతో ఉండాలని అనుకున్నా. ప్రత్యర్థి దూకుడుగా ఆడుతుండగా నా వంతు కోసం వేచి చూశాను. ఫిల్స్ కొన్ని తప్పిదాలు చేయడం నాకు కలిసొచ్చింది. వాటిని నేను వీలైనన్ని పాయింట్లుగా మలచుకోవాలనున్నాను. సెకండ్ సెట్‌లో బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నా. మూడో సెట్‌లోనూన అదే జోరు కొనసాగించి సెమీస్ బెర్తు ఖాయం చేసుకున్నాను' అని మ్యాచ్ అనంతరం కార్లోస్ తెలిపాడు.

# పూరన్, మర్క్‌రమ్ విధ్వంసం

గుజరాత్‌పై 6 వికెట్లతో గెలుపొందిన లక్నో



**లక్నో:** ఐపీఎల్ 18వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జోరు కొనసాగిస్తోంది. వరుస విజయాలతో టేబుల్ టాపర్‌గా ఉన్న గుజరాత్ టైటన్స్‌కు బిగ్ షాకిచ్చింది. ఓపెనర్ల మెరుపులతో భారీ స్కోర్ దిశగా సాగిన గుజరాత్‌ను 180 కే కట్టడి చేసిన లక్నో.. ఆ తర్వాత ఛేదనలోనూ దుమ్మురేపింది. నికోలస్ పూరన్(61), ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(58) హాఫ్ సెంచరీలతో చెలరేగగా 6 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

ఆఖర్లో గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదొని(28 నాటౌట్), డేవిడ్ మిల్లర్(7)లు ఒత్తిడికి లోనవ్వలేదు. 20వ ఓవర్లో బౌండరీ బాదిన బదొని.. ఆ తర్వాత సిక్సర్‌తో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. దాంతో, ఐదో విక్టరీకిపై కన్నేసిన గుజరాత్‌కు భంగపాటు తప్పలేదు.

సొంతగడ్డపై లక్నో సూపర్ జెయింట్స్ పంజా విసిరింది. టేబుల్ టాపర్ అయిన గుజరాత్ టైటన్స్‌ను ఓడించి టాప్ -4లోకి దూసుకెళ్లింది. బంతితోనే కాదు ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన లక్నో మొదట ప్రత్యర్థిని 180కే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్లు ఎడెన్ మర్క్‌రమ్(58), కెప్టెన్ రిషభ్ పంత్()లు ధాటిగా ఆడారు. పవర్ ప్లేలో గుజరాత్ పేస్ గన్స్ సిరాజ్, ప్రసిధ్‌లను ఉతికేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. దాంతో, 6 ఓవర్లలో 62 కొట్టిన లక్నో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే.. సుందర్ బౌలింగ్‌లో పంత్ ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన నికోలస్ పూరన్(61: 34 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్సర్లు) మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మరోవైపు మర్క్‌రమ్ సైతం దూకుడు పెంచి 26 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఈ ఇద్దరి మెరుపులతో లక్నో స్కోర్ 10 ఓవర్లకు 114కు చేరింది.

విజయానికి చేరువైన లక్నోను ప్రసిధ్ దెబ్బకొట్టాడు. మర్క్‌రమ్ ఔటయ్యాక హాఫ్ సెంచరీ బాదిన పూరన్ సైతం రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత డేవిడ్ మిల్లర్(7), ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదొని(28 నాటౌట్)లు జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నారు. అయితే.. లక్నో విజయానికి 18 బంతుల్లో 18 పరుగులు అవసరం అయ్యాయి. రషీద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో బదొని ఫైన్ లెగ్‌లో ఫోర్ బాదాడు. కానీ, ఆ తర్వాత సుందర్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడబోయిన మిల్లర్ బౌల్డ్ అయ్యాడు. ఆఖరి ఓవర్లో 6 రన్స్ కావాలి. అబ్దుల్ సమద్(2) సింగిల్ తీయగా.. బదొని బౌండరీ కొట్టాడు.

### గిల్, సాయి మెరుపులతో

మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటన్స్ 180 రన్స్ కొట్టింది. ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న గుజరాత్ టైటన్స్ నిర్దేశించిన ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(60), సాయి సుదర్శన్(56)లు మరోసారి చితక్కొట్టారు. ఎక్నా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు చుక్కలు చూపించారు. అర్ధ శతకాలతో చెలరేగిన ఈ ద్వయం తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోర్‌కు బాటలు వేసింది. అయితే.. స్ట్రాటజిక్ టైమౌట్ తర్వాత పుంజుకున్న లక్నో బౌలర్లు గుజరాత్ మిడిలార్డర్‌ను క్రీజులో నిలవనీయలేదు. ఆఖర్లో షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(22) ఒక్కడే మెరుపులు మెరిపించగా గిల్ బృందం నిర్ణీత ఓవర్లలో 180 రన్స్ చేయగలిగింది.

# కర్మన్ ఘాట్ ఆలయంలో రామరామ పాట విడుదల




టాకీస్: మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం విశ్వంభర. ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుంది. ఈ మూవీ నుంచి హనుమాన్ జయంతి సందర్భంగా ఫస్ట్ సింగిల్ రామ రామ అనే పాటను విడుదల చేసారు. అయితే ఈ పాట విడుదలకు ముందు దర్శకుడు వశిష్ట.. హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌లో ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నాడు. శనివారం ఉదయం కర్మాన్‌ఘాట్ ఆలయంకు వెళ్లిన వశిష్టతో పాటు- చిత్రబృందానికి ఆలయ అధికారులు స్వాగతం పలికి సినిమా పెద్ద హిట్టు అవ్వాలని కోరుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియోను చిత్రబృందం తాజాగా పంచుకుంది.



నన్ను కాదని అనన్య పాండేను

# తీసుకుంటారా?

అసహనం వ్యక్తం చేసిన హీరోయిన్ నుప్రత్



టాకీస్: బాలీవుడ్ హీరోయిన్ నుప్రత్ తాజాగా తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. తనను కాదని తన సినిమా సీక్వెల్ లో అనన్య పాండేను తీసుకోవడం బాధనిపించిందంటూ తెలిపింది. ఆమె చేసిన తాజా కామెంట్స్ బాలీవుడ్ లో సెన్సేషన్ అవుతున్నాయి. అనన్య పాండే గతంలో లైగర్ సినిమాలో నటించింది. ఆ తర్వాత తెలుగులో కనిపించకుండా పోయింది. ఇప్పడు కేవలం బాలీవుడ్ లో మాత్రమే సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడిపేస్తోంది. అలాంటి అనన్య పాండే తన అవకాశాన్ని కొట్టేసిందంటూ బాలీవుడ్ హీరోయిన్ నుప్రత్ చేసిన కామెంట్స్ ఇప్పడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. 'నేను నటించిన సినిమాకు సీక్వెల్ గా వచ్చిన డ్రీమ్ గర్ల్ 2 సినిమాలో నన్నే తీసుకుంటారని ఎంతో నమ్మకం పెట్టు-కున్నాను. కానీ నన్ను వద్దని అనన్య పాండేను తీసుకోవడం చాలా బాధగా అనిపించింది. అవతలిర వారి నిర్ణయాలను మనం కంట్రోల్ చేయలేం కదా. అందుకే బాధపడటం తప్ప ఏమీ చేయలేకపోయాను' అంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పడు వైరల్ అవుతున్నాయి. 2023లో వచ్చిన డ్రీమ్ గర్ల్ 2 సినిమా మంచి హిట్ టాక్ సంపాదించుకుంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా, అనన్య పాండే కలిసి నటించారు.



25న విడుదల కానున్న

# సారంగపాణి జాతకం

టాకీస్: టాలీవుడ్ దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి, బలగం, కోర్టు సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి కాంబోలో ఒక సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. 'సారంగపాణి జాతకం' అంటూ ఈ సినిమా రాబోతుండగా.. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో వచ్చిన జెంటిల్ మన్, 'సమ్మోహనం, చిత్రాలు నిర్మించిన శ్రీదేవి మూవీస్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదల కాబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విడుదల తేదీని కూడా వాయిదా వేసింది టీమ్. దీంతో కొత్తగా మరో విడుదల తేదీని ప్రకటించింది. ఈ మూవీను ఏప్రిల్ 25న విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో రూప కొడువాయూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాని శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తుండగా.. వి.కె. నరేష్. తనికెళ్ళ భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి , కె.యల్.కె. మణి కీలక పాత్రలలో నటిస్తున్నారు.




టాకీస్:

టాకీస్:

సినిమా ఇండస్ట్రీలో రాణించే అందం, అభినయంతో పాటు అదృష్టం కూడా ఉండాలి. అవకాశాలు రావడం చాలా అరుదు. ఆ అవకాశాలని నిలబెట్టుకోవడం కూడా పెద్ద టాస్కే. కొంత మంది భామలు అయితే ఓవర్‌నైట్ స్టార్స్‌గా మారిపోతుంటారు. మరి కొందరు మాత్రం ఎన్ని సినిమాలు చేసిన సక్సెస్ రాక ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారిలో హెబ్బా పటేల్ ఒకరు. ఈ అమ్మడు తెలుగులో 16 సినిమాలు చేసింది, అందులో హిట్ అయిన సినిమాలు రెండు మాత్రమే. ఇక చేసేదేం లేక సెకండ్ హీరోయిన్‌గా కూడా మారింది. అయిన కూడా సక్సెస్ వరించలేదు. స్పెషల్ సాంగ్స్ చేసింది. వాటితో కూడా పెద్దగా గుర్తింపు రాలేదు. ఇక చేసేదేం లేక సోషల్ మీడియాలో సందడి చేస్తూ హంగామా చేస్తుంటుంది. ఎప్పటికప్పుడు తన అందచందాలతో కుర్రాళ్లకి వల విసురుతూ ఉంటుంది.ఇటీవలి కాలంలో హెబ్బా కాస్త స్లిమ్ అయినట్టుగా కనిపిస్తుంది. ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసే పిక్స్ చూసి కుర్రాళ్లు పిచ్చెక్కిపోతుంటారు. సినిమాలతో కాకపోయిన కనీసం తన అందాలతో అయిన క్రేజ్ పెంచుకోవాలని హెబ్బా ఎంతగానో ప్రయత్నిస్తుంది. ఇక హెబ్బా కెరియర్ చూస్తే అలా ఎలా అనే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది. ఆ తర్వాత కుమారి 21 ఎఫ్ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. దాంతో ఈ చిన్నదాని పేరు మారుమ్రోగింది. దాంతో వరుసగా అవకాశాలు వచ్చాయి కాని అవి సక్సెస్ కాలేకపోయాయి. తెలుగువారిని అలరించిన ముంబై ముద్దుగుమ్మ హెబ్బా పటేల్ ఎందుకో కెరీర్‌లో వెనుకబడిపోయింది . ఇప్పుడు బ్రేక్ కోసం తెగ కష్టపడుతోంది. 6 జనవరి 1989న ముంబైలో జన్మించిన హెబ్బా పటేల్ సోఫియా కాలేజ్ ఫర్ ఉమెన్‌లో చదువుకుంది. వీరి కుటుంబం కర్ణాటక నుంచి మహారాష్ట్రకు వలస వెళ్లిన ముస్లిం ఫ్యామిలీ కాగా, ఈమె పేరు చివరన పటేల్ అన్న ట్యాగ్ చూసి ఈమెను చాలా మంది గుజరాతీ అమ్మాయిగా అనుకుంటారు. 2014లో అధ్యక్ష అనే కన్నడ సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది హెబ్బా పటేల్. తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నఈమె ఆ తర్వాత తమిళ సినిమా తిరుమనం ఏనుం నిఖా అనే సినిమాలో జై సరసన నటించే అవకాశం దక్కింది. ఆ తర్వాత అలా ఎలా ద్వారా తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టారు.

# మహేశ్-రాజమౌళి చిత్రంపై భారీ అంచనాలు

2027 మార్చి 25న విడుదల అంటూ వార్త చక్కర్లు



టాకీస్: తెలుగు ప్రేక్షకులంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న చిత్రాలో సూపర్ స్టార్ మహేష్ బాబు - రాజమౌళి కాంబోలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై భారీ హైప్ ఉంది. కాగా ఈ సినిమాలో ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ముఖ్యపాత్రలో నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్నారట. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ మూవీని నిర్మాత కె ఎల్ నారాయణ ఇంచుమించు రూ. 1,000 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారట. రెండు భాగాలుగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్ నుండి, తాజాగా మొదటి భాగం విడుదలకి సంబంధించి ఓ వార్త వైరల్ అవుతుంది. రిపోర్ట్ ప్రకారం, ఈ చిత్రాన్ని మార్చి 25, 2027 న విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు- ఫిలిం సర్కిల్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాదు రెండో భాగాన్ని 2029 లో విడుదల చేయాలను కుంటున్నారట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ ప్రజంట్ ఈ వార్త వైరల్ అవుతుంది. అంతే కాదు ప్రస్తుతానికి ఆ డేట్‌నే టార్గెట్‌గా పెట్టుకొని సినిమా పనులు కంప్లీట్ చేస్తున్నారట. ఇక దీనిపై మరింత క్లారిటీ రావడం విషయం పక్కన పెడితే.. ఈ న్యూస్ పై కొందరు నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. ఇంకా సినిమా నుండి ఎలాంటి అప్ డేట్ కూడా రాలేదు అప్పుడే విడుదల తేదీనా? అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఒకవేళ నిజంగానే డేట్ లాక్ చేసినా, జక్కన్న సినిమాలు ఎన్నిసార్లు రిలీజ్ డేట్‌లు మార్చుకుంటాయనేది మనకి తెలియంది కాదని వాపోతున్నారు.

# ఈడియట్ పాట రీ క్రియేట్ చేస్తున్న రవితేజ



టాకీస్: రవితేజ హీరోగా నటిస్తోన్న 75వ చిత్రం 'మాస్ జాతర' భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రీలీల కథానాయిక. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ ప్రోమో విడుదలైంది. 'తు మేరా లవర్' అంటూ సాగే ఈ పాటలో రవితేజ.. 'ఇడియట్' సినిమాలోని 'చూపుల్తో గుచ్చి గుచ్చి' పాట ఐకానిక్ స్టెప్పును రీక్రియేట్ చేశారు. ఫుల్ పాట 14న విడుదల కానుంది.

# మోహన్ లాల్ సరసన శోభన

టాకీస్: ఒకవైపు ఎల్2 ఎంపురాన్ సినిమాతో మలయాళ స్టార్ మోహన్ లాల్ విజయం అందుకున్నాడు. పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. బ్లాక్ బస్టర్ చిత్రం లుసిఫర్ సినిమాకి ఈ చిత్రం పార్ట్ 2గా వచ్చింది. మంజు వారియర్, టోవినో థామస్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు వచ్చి దాదాపు రూ. 250 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా తర్వాత మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తుడరుమ్'. ఈ సినిమాకు మలయాళ పాపులర్ డైరెక్టర్, ఆపరేషన్ జీవా ఫేం తరుణ్



మూర్తి దర్శకత్వం వహిస్తుండగా.. రెజపుత్ర విజువల్ మీడియా సమర్పణలో ఎమ్ రెంజిత్ నిర్మిస్తున్నారు.ఇక ఈ చిత్రంలో సీనియర్ నటి శోభన కథానాయికగా నటిస్తుంది. ఇప్పటివరకు మోహన్ లాల్, శోభన కాంబోలో 55 సినిమాలు రాగా.. ఇది 56వ చిత్రంగా రాబోతుంది. మోహన్‌లాల్‌తో చివరిగా 1987లో నటించిన శోభన దాదాపు 38 ఏండ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుంది. ఈ చిత్రం ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మోహన్ లాల్ ఇందులో టాక్సీ డ్రైవర్‌గా నటిస్తుండగా.. అతడి కారు అనుకోకుండా ఒక సమస్యలో ఇరుక్కుంటుంది. అయితే ఆ సమస్య ఏంటి.. ఆ కారుని వదిలిపెట్టి మోహన్‌లాల్ ఒక్కక్షణం ఎందుకు ఉండలేడు అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.